
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 34.0
కనిష్ఠం 21.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శనివారం 5 జూలై 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	522.80 (154.4310)	66,638	15,110
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	208.56	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	155.772 (20.949)	నిల్	4,000

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

ఇసుక కొరత ఓవైపు.. పెరిగిన ధరలు మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసే మొత్తానికి, చేసే ఖర్చు రెట్టింపు కానుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్, స్టీలు, ఇటుకలను తక్కువ ధరకు ఇప్పించేలా చర్యలు తీసుకుంటే ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 నియోజకవర్గాలకు సంబంధించి రెండు దశల్లో ఇప్పటివరకు 39,995 ఇళ్లను మంజూ రు చేశారు. ఇందులో ఇప్పటివరకు కేవలం 24 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి.
- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)



నల్లగొండ మండలం తేలకంటి గూడెంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్లకు
ఆటంకాలు

- ఇసుక కొరత, సిమెంటు ధరలతో ఇబ్బంది
- నామమాత్రంగా మారిన ప్రైస్ మానిటరింగ్ కమిటీలు
- ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలంటున్న లబ్ధిదారులు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇసుక, సిమెంటు, ఇటుకల ధరలు ఆకాశాన్నంటడంతో ప్రభుత్వ నిర్దేశిత వ్యయంలో ఇంటి నిర్మాణం పూర్తికావడం కష్టమేనన్న అనుమానాలున్నాయి. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక సేకరణ ప్రధాన సమస్యగా మారింది. మరోవైపు సిమెంట్, ఇనుము ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఇంటి నిర్మాణం లబ్ధిదారులకు భారంగా మారింది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు రూ.5లక్షలు చెల్లిస్తున్నప్పటికీ లబ్ధిదారులకు ఇంతకు రెట్టింపు స్థాయిలో ఖర్చు పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు. వీలైనంత వరకు ఇసుక, సిమెంట్ ధరలను అందుబాటులోకి తెస్తే ప్రభుత్వం ఆశించినరీతిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగి ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, ఆ దిశగా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇసుక కొరతపై ప్రస్తావన

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను కేటాయించినా లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో లేని పరిస్థితి కొనసాగుతోంది. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ఇసుక కొరతపై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రస్తావించడం ఇసుక కొరత తీవ్రతను తెలియజేస్తోంది. మునుగోడు నియోజకవర్గంలోని సంస్థాన్‌నారాయణపురం మండలంలో ఇసుక రీచ్‌లు లేనందున ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో లేదని, వారికి పొరుగున మండలాల్లో ఇసుకను కేటాయించాలని కోరారు. ఒక్క ఈ మండలమే కాకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 20 మండలాల వరకు ఇసుక కొరత ఉందని, ఈ మండలాల్లో స్థానికంగా ఉన్న చిన్న, చిన్న వాగులను ఇప్పటికే ఇసుక మాఫియా లూటీ చేయడంతో ఇసుక లేకుండా పోయిందని, క్షేత్రస్థాయి పరిస్థితిని గుర్తించి అధికారులు ఈ మండలాల లబ్ధిదారులకు వేరే ప్రాంతాల్లో ఇసుకను కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అదే విధంగా ఇసుక రీచ్‌లు ఉన్న చోట సైతం నాణ్యమైన ఇసుకను ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇవ్వడం లేదని, దీంతో లారీకి..

- మిగతా 7వ పేజీలో...



'ఉపాధి'కి యుక్తధార

అవకతవకలు లేకుండా ప్రత్యేకంగా యాప్ రూపకల్పన

- ఇకనుంచి యుక్తధార యాప్‌లోనే పనులు మంజూరు
- కూలీల వివరాలు, ఖర్చులు ఆన్‌లైన్‌లో నమోదు
- పైలట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామం

ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సాంకేతికతను జోడించి ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటోంది. ఈ పథకం కింద జరుగుతోన్న పనులన్నీ కూడా ప్రజలకు అందుబాటులో ఉండేలా తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఉపాధి కింద చేపట్టే పనుల్లో ఎలాంటి అవకతవలకు చోటులేకుండా ప్రత్యేకంగా యాప్ ను రూపొందించింది. ఇకనుంచి ఈ పథకం కింద శాటిలైట్ ఆధారంగా పనులను గుర్తించనున్నారు. దీని ఆధారంగా పనుల మంజూరుతోపా టు కూలీల వివరాలు, ఇందుకు అయిన ఖర్చు కు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిబంధనలు ఎప్పటికప్పటికీ మారుతున్నా, అవకతవకలు జరుగుతూనే ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. అక్రమాలను నివారించేందుకు పనుల వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేసేలా ప్రభుత్వం చర్యలు చేట్టింది. రాష్ట్రవ్యాప్తంగా బ్యాచ్‌లుగా విభజించి సాంకేతిక సిబ్బందికి వారం రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. 'భువన్' యాప్ వివిధ రకాల పనుల వివరాలు నమోదు చేస్తుండగా, అదే యాప్ లో నూతనంగా 'యుక్తధార'లో పనుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో మొత్తం 17 మండలాలు 428 గ్రామపంచాయతీలు ఉండగా, వీటిలో ముందుగా మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. జిల్లాలోని 17 గ్రామాల్లో ఈ యాప్ కింద పనులు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

శాటిలైట్ ద్వారా పనుల నమోదు

ఉపాధి హామీ పథకంలో ఇప్పటివరకు కేవలం ప్రాంతం చూపి, పనులను ..

- మిగతా 6వ పేజీలో...



'యుక్తధార' యాప్‌పై శిక్షణ ఇస్తున్నాం..

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పథకాన్ని ఇప్పటికే భువన్ యాప్ ద్వారా పనులు, కూలీల వివరాలు నమోదు చేస్తున్నారు. అయితే శాటిలైట్ ఆధారంగా పనులు చేపట్టేలా ప్రభుత్వం యుక్తధారయాప్‌ను రూపొందించింది. ఇకనుంచి ఈ యాప్ ద్వారా పనుల గుర్తింపుతోపాటు వివరాలు నమోదు చేసేందుకు ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కూలీలకు ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.గ్రామాలవారీగా చేపట్టనున్న పనులపై గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పనులను గుర్తిస్తున్నాం.
- నాగిరెడ్డి, డీఆర్డీవో

సాగు చట్టాలపై అవగాహన ఉండాలి

రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్



రైతులకు సాగుచట్టాలపై అవగాహన కల్పిస్తున్న భూమి సునీల్

నార్కట్‌పల్లి, నకిరేకల్, కనగల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): సాగు చట్టాలపై ప్రతీ రైతు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాగు న్యాయయాత్ర శుక్రవారం జిల్లాలోని నార్కట్‌పల్లి, నకిరేకల్, కనగల్ మండలాల్లో నిర్వహించారు. ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. వ్యవసాయం చేస్తూ కేవలం పంటల సాగుపైనే అవగాహన ఉంటే సరిపోదని, భూమిని నమ్ముకుని జీవిస్తున్న రైతులకు సాగు న్యాయచట్టాలు కూడా తెలిసి ఉండాలన్నారు. రైతులకు చట్టాలను చుట్టాలుగా చేయడమే న్యాయయాత్ర ఉద్దేశమన్నారు. నాణ్యత లేని విత్తనాలు, ఎరువుల మోసాలు, మార్కెట్‌లో జరిగే అన్యాయం, పంటల బీమా వంటి అంశాల్లో రైతులకు మేలు చేసే న్యాయ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆయా సమావేశాల్లో భూదాన్‌భూముల సంస్థ మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఏడీఏ జమీరుద్దీన్, ఏవోలు గౌతమ్, డీటీ రామకృష్ణ, అమరేందర్‌గౌడ్, హరివెంకట ప్రసాద్, జీవన్, అబిలాష్, సందీప్, మల్లేశ్, రవి, ప్రవీణ్, నవీన్, అభిలాష్ ఆదర్శ రైతు సంఘం అధ్యక్షుడు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

- విద్యార్థులు కష్టపడి చదవాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



గురుకుల కళాశాలలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

డిండి, దేవరకొండ, కొండమల్లేపల్లి, కేతేపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు, కేజీబీవీలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లాలోని డిండి, దేవరకొండ, కొండమల్లేపల్లి, కేతేపల్లిలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, వసతులు, సదుపాయాల గురించి ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. అదనపు మంచాలు, బాత్రూంలు, తాగునీటి వసతి, అదనపు తరగతి గదులు, డార్మెటరీ తదితర విషయాల గురించి ఆరాతీశారు. ఆమె విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, వసతుల కల్పన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ, వంటగదిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఆయా పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పాఠశాల పక్కా భవనాలను ఆమె పరిశీలించారు. డిండి మండల కేంద్రంలో ని సాంఘిక సంక్షేమ(బాలికల) గురుకుల పాఠశాల సందర్శించిన సమయంలో ప్రధానంగా గురుకులంలో డ్రైనేజీ, నీటి సమస్య, కోతుల బెడద ఉన్నట్లు ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు విన్నవించారు. దేవరకొండ మండలంలోని సాంఘిక సంక్షేమ, గిరిజన, మైనార్టీ, బీసీ సంక్షేమ పాఠశాలలు, కళాశాలలను పరిశీలించారు. పెంచికల్‌పహాడ్ తెలంగాణ గిరిజన గురుకుల కళాశాలను కళాశాలలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ కావాలని, రెసిడెన్షియల్ బ్లాక్ సరిపోవడంలేదని, కళాశాలలో 666 మంది విద్యార్థులు ఉండగా 50 మందికి మంచాలులేవని, మంచాలు, అదనపు తరగతి గదులు, డార్మెంటరీ కావాలని ప్రిన్సిపాల్ కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కేతేపల్లి మండలంలోని బొప్పారం గ్రామ శివారులో గల మూసీ గురుకుల బాలుర పాఠశాలను సాయంత్రం సందర్శించారు. అక్కడ వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులతో కలిసి కాసేపు సరదాగా వాలీబాల్ ఆడారు. అనంతరం ఆమె వారితో మాట్లాడి భోజన నాణ్యత, వసతుల కల్పన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోవడానికి కారణాలను తెలుసుకున్న ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్లు విద్యారాణి, బలరాంనాయక్, స్వప్న, విష్ణు, ఎంఈవో గోప్యానాయక్, కేతేపల్లి తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు ఉన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిగా రామకృష్ణారెడ్డి



రామకృష్ణారెడ్డి

బీబీనగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియామకం కాబోతున్న నలుగురు న్యాయమూర్తుల్లో ఒకరు వాకిటి రామకృష్ణారెడ్డి ఉమ్మడి జిల్లా వాసి కావడం విశేషం. బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని చిత్రకానిగూడెం ఆయన స్వస్థలం. మాజీ సర్పంచ్, మాజీ జడ్పీటీసీ వాకిటి బాల్‌రెడ్డి రెండో కుమారుడు రామకృష్ణారెడ్డి 1970 సెప్టెంబరు 14న జన్మించారు. 1997లో న్యాయవాదిగా ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరఫున న్యాయవాదిగా కొనసాగిస్తున్నారు. హైదరాబాద్‌లోని నాన్‌సింగ్ మంచిరేవులలో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న కేంద్రం

- కార్మిక సంఘాల నాయకులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్ష, కార్మిక సంఘాల నాయకులు

నల్లగొండ రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి.నర్సింహ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తోందని ఆరోపించారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం చేస్తున్న ఆందోళన, పోరాటాలతో ఐదేళ్లుగా అమలు చేయలేదని ఇప్పుడు అమలు చేస్తూ పూర్తిగా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కేవీఎస్ రెడ్డి, డి.వెంకన్న, ఎండీ. సలీం, దండంపల్లి సత్తయ్య, అవుట రవీందర్ అద్దంకి నరసింహ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సమ్మె చేసే హక్కు లేకుండా కేంద్ర ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే ఆశాలకు ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనాన్ని అమలు చేసి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రొండి శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, నాగయ్య, తంగెళ్ల నాగమణి, వెంకటాచారి, వెంకటయ్య పాల్గొన్నారు.

సాగర్ ఎడమ కాలువకు
నీటి విడుదల

- ఖమ్మం జిల్లా ప్రజల తాగు నీటి అవసరాల కోసమే
- 4 రోజుల పాటు కొనసాగనున్న నీటి విడుదల



సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేస్తున్న జేఈ కృష్ణయ్య

నాగార్జునసాగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం పాలేరు జలాశయాన్ని నింపేందుకు సాగర్ నుంచి నీటి విడుదల ప్రారంభమైంది. శుక్రవారం పెద్దవూర మండలం పొట్టిచెల్మ వద్ద ఉన్న ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రాజెక్టు జేఈ కృష్ణయ్య నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోజుకు 3 వేల క్యూసెక్కుల చొప్పున నాలుగు రోజుల్లో ఒక టీఎంసీ నీటిని విడుదల చేయనున్న ట్లు పేర్కొన్నారు. ఈ నీటిని కేవలం పాలేరు జలాశయం నింపడానికేనని, ఆయకట్టులో రైతులు ఎవరు వాడుకోవద్దని సూచించారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 522.50 అడుగులుగా(153. 8745 టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 2,114 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కులు మొత్తంగా 3,014 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 54,542 క్యూసెక్కుల నీరు సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి కుడి, వరద కాలువకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎలాంటి నీటి విడుదల లేదు.

సాగర్‌ను సందర్శించిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం

నాగార్జునసాగర్‌ను శుక్రవారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం, కేంద్ర పథకాల పర్యవేక్షణ నిర్వహణ బృంద సభ్యులు సందర్శించారు. సాగర్ ప్రధాన డ్యాంతో పాటు బుద్ధవనానికి చే రుకొని అక్కడ బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత చరిత వనం, జాతక వనం, బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వారికి వివరించారు. బృందంలో నావెల్ ప్రకాష్, అభిషేక్ విశ్వాస్, బీపీ యాదవ్, సలీం ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు సామగ్రిని సిద్ధం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, జూలై 4(ఆంధ్రజ్యోతి): రానున్న వానాకాలంలో సీజన్ ధాన్యం కొనుగోలుకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో వానాకాలం 2025 సీజన్ సంబంధించి వ్యవసాయ మార్కెట్ యార్డులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 10వ్యవసాయ మార్కెట్లు ఉండగా ఇటీవల జిల్లా యంత్రాంగం రెండు వ్యవసాయ మార్కెట్ యార్డులకు మొబైల్ గ్రేన్ డ్రైయర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మార్కెట్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేశం, జిల్లా మేనేజర్ హరీష్, డీఆర్‌వో శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోల పాత్ర కీలకం

తిరుమలగిరి(సాగర్): ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోల పాత్ర కీలకమైందని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేయాలని, గ్రామంలో నివసించని, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని అన్నారు.

అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పనుల పురోగతి గురించి ఎంఈవో శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో మౌలిక సదుపాయాల గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎలక్షన్ డీటీ మల్లికార్జున్, ఎలక్షన్ రిసోర్స్ పర్సన్లు మేదరి దేవేందర్, బి.బాలు, ఆర్వి లక్ష్మీకాంత్, సలీం, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

కంట్రిబ్యూటర్లు కావలెను

నల్లగొండ జిల్లాలో ఈ క్రింది సెంటర్ల నుంచి వార్తలు సేకరించేందుకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. అభ్యర్థులు స్థానిక స్థితిగతులపై స్పష్టమైన అవగాహన, నిష్పాక్షిక దృక్పథం, విషయాన్ని చక్కని తెలుగులో రాయగల సామర్థ్యం కలిగి ఉండాలి. ఆసక్తి ఉన్నవారు బయోడేటా, 2 పాస్‌ఫోటోలు తీసుకొని రాత పరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరు కావలసి ఉంటుంది.

కావలసిన సెంటర్లు

నల్లగొండ అర్బన్, నల్లగొండ సిటీ

రాతపరీక్ష తేదీ : 07.07.2025 సోమవారం
సమయం : ఉదయం 10 గంటలకు
స్థలం : నల్లగొండ ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయం

న్యూస్ నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి

సంప్రదించవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి యూనిట్‌కార్యాలయం :
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వేనెం. 1617, అద్దంకి బైపాస్‌రోడ్, AMRP కెనాల్ వద్ద, ఆర్జాలబావి గ్రామము, నల్లగొండ. 508001.
Email: bm.nlg@andhrajyothy.com

కాల్వలు ఇలా.. నీరు పారేదెలా



ఎత్తిపోతల పరిధిలో చెట్లతో పూడుకుపోయిన కాల్వలు

- అధ్వానంగా జైకిసాన్ ఎత్తిపోతల కాల్వలు
- రోజురోజుకు తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు

నాగార్జునసాగర్ ఎడమకాల్వకు అనుసంధానంగా ఏర్పాటుచేసిన ఎత్తిపోతల కింద ఆయకట్టు రోజురోజుకూ తగ్గిపోతోంది. దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఎత్తిపోతల కాల్వలను పట్టించుకోకపోవడంతో చెట్లతో పూడుకుపోయి చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. దీంతో రైతులు వేలాది రూపాయలు వెచ్చించి బోరు బావులను ఆశ్రయిస్తున్నారు. సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాలు ప్రభుత్వ నిర్వహణ లోపంతో రైతుల పాలిట శాపంగా మారింది.

\- (ఆంధ్రజ్యోతి-వేములపల్లి)

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని జైకిసాన్(ఎల్-18, 19) ఎత్తిపోతల పథకం పరిధిలోని సల్కునూరు, తడకమళ్ల, మొల్కపట్నం, మంగాపురం, బొమ్మకల్ గ్రామాల్లోని సుమారు 3,263ఎకరాలకు సాగునీరు అందించేందుకు సాగర్ ఎడమకాల్వపైన 70.80కిలోమీటర్ల పరిధిలో జైకిసాన్ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటుచేశారు. కొంతకాలం క్రితం సాగర్ ఆధునికీకరణలో భాగంగా ఎత్తిపోతల పరిధిలోని మోటార్లను, ట్రాన్స్‌ఫార్మర్లను ఆధునీకరించినప్పటికీ కాల్వకట్టల మరమ్మతులు మాత్రం చేపట్టడంలేదు. దీంతో మరమ్మతులకు నోచని కాల్వకట్టలు పలుచోట్ల తూములు, షట్టర్లు దెబ్బతిని చెట్లు, చేమ పెరిగి ఉనికిని కోల్పోతున్నాయి. దీంతో స్థిరీకరించిన ఆయకట్టు మొత్తానికి నీరందక విస్తీర్ణం తగ్గిపోతోంది. దీంతో రైతులు చేసేదేమీ లేక బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. ఎన్నికల ముందు ఎత్తిపోతలను ప్రభుత్వపరంగా నిర్వహిస్తామని చెబుతున్నా ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో రైతులే వాటిని నిర్వహించుకోవాల్సి వస్తుండడంతో పూర్తిస్థాయిలో వాటి నిర్వహణ చేపట్టలేకపోతున్నారు. దీంతో కాల్వకట్టలు మరమ్మతులు నోచుకోక చెట్లతో పూడుకుపోయాయి. సాగునీరు చివరి ఆయకట్టుకు చేరక రైతులు ఆర్థికభారంతో ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే విషయమై పలుమార్లు రైతులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని వాపోతున్నారు.

మరమ్మతులు చేసి ఆయకట్టును స్థిరీకరించాలి



ఎల్-18, 19 ఎత్తిపోతల పథకం పరిధిలోని కాల్వలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సాగునీరు అందించాలి. కొంతకాలంగా కాల్వలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో తూములు దెబ్బతినడం, కాల్వల్లో పిచ్చిచెట్లు పెరిగి చివరి ఆయకట్టుకు నీరందడంలేదు. చేసేదేమీ లేక రైతులు బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. ఎన్ఎస్‌పీ అధికారులు కాల్వలను పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలి.

\- పేరెల్లి యాదగిరి (రైతు, సల్కునూరు)

ప్రభుత్వానికి నివేదించాం

ఎల్-18, 19 ఎత్తిపోతల పరిధిలోని కాల్వలు చెట్లతో పూడుకుపోయి పలుచోట్ల తూములు మరమ్మతులు గురైన విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతాం.

\- భిక్షం (ఏఈ, ఎన్ఎస్‌పీ)

మరమ్మతులకు నోచుకోని ముప్పారం



ఎత్తిపోతల గోడకు బదులుగా ఇసుక వేసిన బస్తాలు

(ఆంధ్రజ్యోతి-హాలియా)

హాలియా పరిధిలో ఎల్-3 ముప్పారం ఎత్తిపోతల పథకం మరమ్మతులు ఆలస్యం కావడంతో వానాకాలం సాగుపై రైతులు సందిగ్ధంలో పడ్డారు. నాన్‌ఆయకట్టు రైతులకు సాగునీరందించే ఉద్దేశంతో ఈ పథకాన్ని టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేసిన కుందూరు జానారెడ్డి ఏర్పాటుచేయించారు. ఈ ఎత్తిపోతల కింద సుమారు 4,800 ఎకరాలకు అనుముల మండలంలోని పాలెం, చింతగూడెం, నిడమనూరు మండలంలోని ఊట్కూరు, ముప్పారం గ్రామశివారులోని రైతులకు సాగు నీరు అందుతోంది. ఇటీవల ఎత్తిపోతల గోడలు కూలడంతో తాత్కాలికంగా యాసంగిలో ఇసుక బస్తాలను వేసి సాగునీరు అందించారు. గోడ మరమ్మతుల కోసం ప్రస్తుత ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసినా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నేటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో నాలుగు గ్రామాల రైతులు వానాకాలంలో సాగు చేయాలా, వద్దా అని అయోమయంలో పడ్డారు. గోడ తొలగించి నిర్మించేందుకు సమయం పట్టే అవకాశం ఉంది. వేసవిలోనే పనులు ప్రారంభిస్తే రైతులకు సకాలంలో సాగు నీరు అందేవి. ఈ క్రమంలో ఆందోళనలో ఉన్న పాలెం, చింతగూడెం గ్రామాల రైతులు శుక్రవారం ఎత్తిపోతల వద్ద నిరసన తెలిపారు. త్వరగా మరమ్మతులు పూర్తిచేసి సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు.



పిచ్చిమొక్కలతో మూసుకుపోయిన కాల్వ తూము

లేని షట్టర్లు, తూములు

ముప్పారం ఎత్తిపోతల పథకం కింద కాల్వలపై షట్టర్లు, తూములు లేక పైన భూములు ఉన్న రైతులు మాత్రమే అదనంగా నీరు మలుపుకొని సాగు చేసుకుంటున్నారని, చివరి భూముల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ తూములు కానీ, షట్టర్స్ లేకపోవడంతో నీరు వృథా అవుతుందని, మిగతా వారికి అవసరానికి సాగుకు ఉపయోగపడడం లేదని రైతులు వాపోతున్నారు.

మరమ్మతుల పనులు చేపట్టాలి



ఎత్తిపోతల పథకం గోడ మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలి. సకాలంలో సాగు నీరు అందించాలి. నీరందుతుందో లేదోనని ఏపంట వేయాలో అర్థం కావడం లేదు. త్వరగా పూర్తి ఏస్తే వరి సాగుకు ఉపయోగంగా ఉంటుంది.

\- జక్కల శ్రీను, పాలెం, రైతు

పనులను వేగవంతం చేస్తాం

ముప్పారం ఎత్తిపోతల మరమ్మతులకు టెండర్లు ప్రక్రియ పూర్తయ్యింది. పనులను ప్రారంభించాలని ఆదేశించాం. ఒకటి, రెండు రోజుల్లో పనులను ప్రారంభించి, పూర్తి చేసి ఆగస్టు చివరి వరకు నీరందిస్తాం.

\- జగపతి, ఏఈ, అనుముల

మూసుకుపోయిన కాల్వలు

ముప్పారం ఎత్తిపోతల పథకం కింద కాల్వలు పిచ్చిమొక్కలుతో మూసుకుపోయాయి. నీరు వెళ్లే పరిస్థితి లేదు. మొక్కల తొలగింపుతో పాటు కాల్వల పూడికలు కూడా తీస్తేనే చివరి భూములకు సాగు నీరందే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

బాలికను గర్భవతిని చేసిన కేసులో

20ఏళ్ల జైలుశిక్ష

● బాధితురాలికి రూ.10లక్షల పరిహారమివ్వాలని ఆదేశం

నల్లగొండ క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బాలికను గర్భవతిని చేసి మోసం చేసిన కేసులో నిందితుడికి 20ఏళ్ల కఠిన జైలు శిక్ష, రూ.35వేల జరిమానా విధిస్తూ నల్లగొండ న్యాయస్థానం తీర్పునిచ్చింది. శుక్రవారం నల్లగొండ జిల్లా రెండో అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు, అత్యాచారం, పోక్సో కేసుల ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి ఎన్.రోజారమణి ఈ మేరకు తీర్పు వెల్లడించారు. నల్లగొండ జిల్లా వాడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన అల్లం మహేష్ ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి మోసం చేశాడు. దీంతో 2014లో బాధితురాలు వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేశారు. నిందితుడిపై నేరం నిరూపణ కావడంతో 20ఏళ్ల జైలుశిక్ష, రూ.25 వేల జరిమానా విధించింది. ఇదే ఘటనలో బాలికను మోసం చేసిన నేరం కింద ఏడాది జైలుశిక్ష, రూ.5వేల జరిమానా, బాలికను మోసం చేసి ఆమె ఆస్తిని అప్పగించాలని ప్రేరేపించిన నేరం కింద మరో ఏడాది జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించారు. మూడు శిక్షలను ఏకకాలంలో అమలుచేసిన క్రమంలో 20ఏళ్ల జైలు శిక్ష రూ.35వేల జరిమానా చెల్లించాలని తీర్పులో వెల్లడించారు. అలాగే బాధితురాలికి రూ.10లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం నుంచి చెల్లించాలని ఆదేశించింది. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ బాధితురాలి తరుపున వాదించారు. నిందితుడికి శిక్షపడేలా సరైనా ఆధారాలను సేకరించి కోర్టులో సమర్పించిన అప్పటి విచారణ అధికారులు ఎస్ఐ వీరరాఘవులు, సీఐలు ప్రకాష్, మహేష్, నరసింహారెడ్డి, రవీందర్, ప్రస్తుత మిర్యాలగూడ సీఐ పీఎండీ ప్రసాద్, వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సీడీవో యూనస్, భరోసా లీగల్ సెల్ అధికారి కల్పన ను నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

చైన్‌స్నాచింగ్ కేసులో ఏడాది జైలు శిక్ష

తిరుమలగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుడికి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించినట్లు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2021 మామిడిపల్లి గ్రామానికి చెందిన బానోతు భారతి, తిరుమలగిరి నుంచి తండాకు వెళ్తుండగా గానుగుబండ తండాకు చెందిన పోలెపాక రమేష్ వెనుక నుంచి మెడలోని బంగారు గొలుసు తెంపుకొని పరారైనట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ డానియేల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు తెలిపారు. తుంగతుర్తి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఎండీ గౌస్‌పాషా, ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

కొండమల్లేపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని కేశ్యతండా సమీపంలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేశ్యతండా నుంచి రాముని గుండ్లతండాకు వెళ్లే మార్గంలో రోడ్డుకు కొద్ది దూరంలో గుట్ట ప్రాంతంలో నాంపల్లి, దేవరకొండ, మాల్ ప్రాంతానికి చెందిన 9మంది పేకాట ఆడుతుండగా సమాచారం అందిందని ఎస్ఐ తెలిపారు. సిబ్బందితో దాడి చేసి పట్టుకునేందుకు ప్రయత్నించగా నలుగురు పరారైనట్లు తెలిపారు. ఐదుగురిని అరెస్టు చేయడంతో మూడు ద్విచక్రవాహనాలు, రూ.31వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

12 కిలోల గంజాయి స్వాధీనం



విలేకరుల సమావేశంలో గంజాయి స్వాధీనం కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని అక్రమంగా తరలించి విక్రయిస్తున్న ఆరుగురు యువకులను సూర్యాపేట జిల్లా కేంద్ర, సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.6లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కొత్తపల్లి నర్సింహ శుక్రవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేటలోని ముత్యాలమ్మ దేవాలయం ప్రాంతానికి చెందిన ఫొటోగ్రాఫర్ పిట్టల నాగరాజు, చంద్రన్నకుంటకు చెందిన డీజే వర్కర్ ఆది వంశీ, ఇందిరమ్మ ఆస్పత్రి ప్రాంతానికి చెందిన విశ్వనాథుల సాయికుమార్, మోతె మండలానికి చెందిన ఆటోడ్రైవర్ దోసపాటి వంశీ, క్రిష్ణా థియేటర్ ప్రాంతానికి చెందిన సారగండ్ల శివకార్తీక్, సుదరయ్యనగర్‌కు చెందిన హోటల్‌లో పనిచేసే అంగోతు వంశీ, దాసాయిగూడెం ప్రాంతానికి చెందిన విద్యార్థి రెడ్డిపల్లి మధుసూదన్, రాజీవ్‌నగర్‌కు చెందిన కూతురు ఆకాశ్, శాంతినగర్‌కు చెందిన కూలీ శూర శ్రవణ్‌కుమార్, హనుమాన్‌నగర్‌కు చెందిన డ్రైవర్ గుండారపు శివలు స్థానికంగా ఉండటంతో ఒకరికొకరు పరిచయం. వీరు గంజాయిని తక్కువ ధరకు తెచ్చి ఎక్కువకు విక్రయిస్తుంటారు. అదే క్రమంలో ఇటీవల ప్రతి ఒక్కరూ రూ.3 వేల చొప్పున మొత్తం రూ.30వేలు జమ చేశారు. ఆ డబ్బులను పిట్టల నాగరాజు, ఆది వంశీ తీసుకుని జూన్ 30న ఒరకుకు వెళ్లి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి 12 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. ఈ నెల 3న సూర్యాపేటకు తెచ్చిన గంజాయిని సమానంగా పంచుకునేందుకు ఈ నెల 3న సాయంత్రం నల్లచెర్వు వద్దకు రావాలనుకున్నారు. అనుకున్న మేరకు నాగరాజు, అంగోతు వంశీతో కలిసి గంజాయిని స్కూటీపై తీసుకెళ్లారు. పనినిమిత్తం ఆది వంశీ, విశ్వనాథుల సాయికుమార్, దోసపాటి వంశీ, సారగండ్ల శివకార్తీక్ అక్కడికి రాలేదు. వారి వాటాకు వచ్చే గంజాయిని మిగిలిన వారిని తీసుకొమ్మని చెప్పారు. సమాచారం అందుకున్న పట్టణ, సీసీఎస్ పోలీసులు దాడి చేసి నాగరాజు, అంగోతు వంశీ, రెడ్డిపల్లి మధుసూదన్, కూతురు ఆకాశ్, శూర శ్రవణ్‌కుమార్, గుండారపు శివలను అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి వీరితో పాటు ఆది వంశీ, విశ్వనాథుల సాయికుమార్, దోసపాటి వంశీ, సారగండ్ల శివకార్తీక్‌లపై కూడా నమోదు చేశారు. అరెస్టయిన ఆరుగురిని రిమాండ్‌కు తరలించగా మిగిలిన నలుగురు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. గంజాయిని ముఠాను పట్టుకున్న పట్టణ పోలీసులు, సీసీఎస్ పోలీసులను అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సీసీఎస్ సీఐ శివకుమార్, పట్టణ, సీసీఎస్ ఎస్ఐలు ఏడుకొండల్, మహేంద్రనాథ్, హరికృష్ణ సిబ్బంది వీరయ్య, నవీన్, రమేష్, ఆనంద్, మంజుల ఉన్నారు.

● గరిడేపల్లి మండలంలో 2.5 కిలోలు స్వాధీనం



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

హుజూర్‌నగర్ / గరిడేపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని గోవిందపురం ప్రాంతానికి చెందిన కొప్పుల శ్రీకాంత్, గోదాంబజార్‌కు చెందిన షేక్ నజీర్, టీచర్స్ కాలనీకి చెందిన బొల్ల బాలకష్ణ, చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గనవరపు శ్రీకాంత్‌లు గరిడేపల్లి మండలం రాయినిగూడెం సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు గరిడేపల్లి ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడి చేసి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. శ్రీకాంత్ నెల రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరుకు వెళ్లి కార్తీక్ అనే వ్యక్తికి రూ.8 వేలు ఇచ్చి నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కాగా శ్రీకాంత్ కొంత గంజాయిని సేవించి పట్టణానికి చెందిన బాలకష్ణ, నజీర్, శ్రీకాంత్‌లకు రూ.3వేలకు రాయినిగూడెం సమీపంలోని కాల్వపల్లి రోడ్డు మార్గంలో విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. కాగా వారి వద్ద నుంచి రెండు కిలోల 350 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, పల్సార్ బైకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయిపైన ఉక్కుపాదంపై మోపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ చరమందరాజు.ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



దేవరకొండలో కోదాడ-జడ్చర్ల జాతీయరహదారిపై డ్రంకెన్‌డ్రైవ్‌లో భాగంగా డ్రైవర్లకు పరీక్షలు నిర్వహిస్తున్న సీఐ నర్సింహులు

దేవరకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా దేవరకొండ సీఐ నర్సింహులు హెచ్చరించారు. శుక్రవారం దేవరకొండలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై వాహనాల డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి, మాట్లాడారు. పోలీస్‌శాఖ సూచించిన నియమ, నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనంపై ఇద్దరే వెళ్లాలని సూచించారు. ప్రమాదాల నివారణకు హెచ్చరికల బోర్డులు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీలలో దేవరకొండ ఎస్ఐ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

సూర్యాపేట క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుతో పాటు పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న సూర్యాపేట పట్టణంలోని పలుప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఐదుగురు మోతాదుకు మించి మద్యం తాగినట్లు తెలిపారు. వారిని శుక్రవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి ఒక రోజు జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, మిగిలిన నలుగురికి కలిపి రూ.4500 జరిమానా విధించినట్లు తెలిపారు. వాహనాలు నడిపేవారు విధిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ తెలిపారు.

కబేళాలకు ఆవులు తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

కోదాడ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామం నుంచి హైదరాబాద్‌లోని కబేళాలకు ఆవులు తరలిస్తున్న ఇరువురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. షేక్ ఆరీఫ్, అస్లాంలు గుడిబండ గ్రామంలో 10 ఆవులను కొనుగోలు చేసి ఓ వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. పట్టుబడిన ఆవులను హైద్రాబాద్‌లోని జియాగూడ గోసంరక్షణ శాలకు తరలించామన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


భూమి విక్రయించాడని తండ్రి హత్య

సూర్యాపేట క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : భూమిని విక్రయించాడనే కోపంతో తండ్రిని చంపిన కుమారుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కొత్తపల్లి నర్సింహ శుక్రవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మోతె మండలం విభలాపురం గ్రామశివాసం నాగయ్యగూడెం ప్రాంతానికి చెందిన నిమ్మరబోయిన వెంకన్నకు భార్య, కుమారులు గంగయ్య, ఉప్పయ్య, కుమార్తె స్వరూప ఉన్నారు. వెంకన్నకు గ్రామశివారులో 4.29 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి విషయంలో తండ్రి, కుమారుల మధ్య తగాదా జరుగుతోంది. ఐదు నెలల కిందట పెద్దమనుషుల సమక్షంలో వెంకన్నతో పాటు భార్యకు కలిపి ఎకరం, ఇద్దరు కుమారులకు చెరో ఎకరన్నర చొప్పున, మిగిలిన 29 గుంటలు కుమార్తెకు చెందేలా అగ్రిమెంట్ రాసుకున్నారు. ఆ మేరకు భూమిని పట్టా చేయాల్సి ఉంది. అయితే వెంకన్న తన భాగానికి వచ్చిన ఎకరం భూమిని అప్పులు తీర్చేందుకు విక్రయిస్తుండగా తనకు విక్రయించాలని కోరాడు. అదే సమయంలో వాటా కింద రావాల్సిన భూమిని పట్టా చేయాలన్నాడు. అయినా చేయకపోగా ఎకరం భూమిని విక్రయించాడు. ఈ విషయమై ఆగ్రహంతో ఉన్న పెద్దకుమారుడు గంగయ్య తండ్రి వెంకన్నను ఎలాగైనా చంపాలని అదును కోసం చూశాడు. అందుకోసం తన వెంట గొడ్డలి పెట్టుకుని తిరగసాగాడు.

గుర్తు పట్టవద్దని హెల్మెట్ పెట్టుకుని..

ఈ నెల 2వ తేదీన వెంకన్న సూర్యాపేట నుంచి నాగయ్యగూడెం వెళ్తున్నాడు. ఆ సమయంలో నిందితుడు గంగయ్య మోతె మండల కేంద్రం శివారులో తన బైక్‌లో పెట్రోల్ పోయించుకుని గ్రామానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాడు. తండ్రి ఒంటరిగా వెళ్లడాన్ని గమనించిన గంగయ్య తనను గుర్తుపట్టకుండా హెల్మెట్‌ను పెట్టుకున్నాడు. కొద్ది దూరం వెళ్లాక విభలాపురం గ్రామశివారున వెంకన్నను అడ్డగించి అప్పటికే తన వెంట తెచ్చిన గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో వెంకన్న తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న మోతె పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వెంకన్నను చికిత్సనిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకన్న కుమార్తె స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాగా హత్యకు పాల్పడిన గంగయ్య శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం క్రాస్‌రోడ్డు ఉండగా పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన గొడ్డలి, హెల్మెట్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడు గంగయ్యను కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, మునగాల సీఐ రామక్రిష్ణారెడ్డి, మోతె ఎస్ఐ యాదవేంద్రరెడ్డితో పాటు మోతె సిబ్బంది ఉన్నారు

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య



మత్స్యగిరి(ఫైల్)

చిట్యాల రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఎలికట్టె గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ మామిడి రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఎలికట్టెకు చెందిన జక్కలి నత్తయ్య, పార్వతమ్మల కుమారుడు మత్స్యగిరి(22) ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం తనకున్న గేదెలను పొలం వద్ద కట్టేసేందుకని వెళ్లాడు. కడుపునొప్పి రావడంతో భరించలేక పొలం వద్ద ఉన్న క్రిమిసంహారక మందు తాగి కుప్పకూలిపోయాడు. అనంతరం విషయాన్ని గ్రామంలోని బంధువులకు సెల్‌ఫోన్ ద్వారా తెలిపాడు. హుటాహుటిన బంధువులు, కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి మత్స్యగిరిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఏడాదిన్నర క్రితమే వివాహం కాగా భార్య మహేశ్వరి, సుమారు 6 మాసాల కుమారుడు ఉన్నారు. ఇటీవలే తన కుమారుడికి అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించినట్లుగా గ్రామస్థులు తెలిపారు. మత్స్యగిరి భార్య మహేశ్వరి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

మర్రిగూడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. చండూరు మండలంలో ఇద్దరు ద్విచక్రవాహనంపై వెళుతూ మహిళా మెడలోని పుస్తెలతాడును దొంగిలించి పరారయ్యారు. శుక్రవారం జిల్లా పోలీస్‌శాఖ ఆదేశాల మేరకు మర్రిగూడ పోలీసులు అప్రమత్తమయ్యారు. మధ్యాహ్నం చైన్‌స్నాచర్స్ కోసం సరంపేట, శివన్నగూడెం క్రాస్‌రోడ్డు వద్ద విస్తృతంగా వాహన తనిఖీలుచేపట్టారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయడంతో వాహనదారులను ప్రశ్నించారు. వాహనాల ధ్రువపత్రాలతో పాటు వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.

'ఉపాధి'కి యుక్తధార

(5వ పేజీ తరువాయి)

భువన్ యాప్‌లో నమోదు చేసేవారు. పనులు పూర్తి చేసిన తర్వాత వివరాలను నమోదు చేస్తే సరిపోయేది. చేసిన పనుల వివరాలను ఆ ప్రాంతంలో ఎక్కడి నుంచైనా నమోదు చేసినా ఇబ్బంది ఉండేది కాదు. ఈ సంవత్సరంలో పనిచేస్తే మరో ఏడాది సామాజిక తనిఖీ అనంతరం మళ్లీ అక్కడ పనిచేసినా యాప్‌లో తీసుకునేది. ప్రస్తుతం పనులు చేసే వివరాలను ముందుగానే శాటిలైట్ ద్వారా యుక్తధార యాప్ నమోదు చేయాల్సిఉంటుంది. రోజువారీగా పనుల వద్దకు వెళ్లి నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం చేసిన పని మరో సంవత్సరంలో చేస్తే యాప్ అంగీకరించదు. దీంతో పనుల్లో పారదర్శకతతోపాటు పనుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండనున్నాయి. పనులు, కూలీల వివరాలు, ఎంత వ్యయం చేశారన్న వివరాలు యాప్ ద్వారా తెలుసుకునే వీలుంటుంది.

ఈసీ, టీఏలకు శిక్షణ షురూ..

ప్రస్తుతం మండలంలోని సాంకేతికసలహాదారు(ఈసీ), సాంకేతిక సహాయకుడు(టీఏ)లకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలో మూడు ఈసీ పోస్టులు, 12 మంది టీఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పూర్తిస్థాయిలో ఈసీలు, టీఏలు లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఖాళీగా ఉన్న పోస్టుల్లో పక్క మండలాల సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించి పనులు చేయిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన పంచాయతీలకు టీఏను నియమించలేదు. దీంతో ప్రస్తుతం ఉన్నవారితోనే చేపడుతున్నారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు 90శాతం ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 7.66లక్షల జాబ్‌కార్డులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 7.66లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో 1.43లక్షల జాబ్ కార్డులు ఉండగా, 2.63లక్షల మంది కూలీలు ఉన్నారు. పనిచేసే (యాక్టివ్) కూలీలు 1.29లక్షల మంది ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 3.60లక్షల జాబ్ కార్డులుండగా, 7.66 లక్షల మంది కూలీలు ఉన్నారు. పనిచేసే వారు 2.22 లక్షల మంది ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో 2.63లక్షల జాబ్ కార్డులుండగా, 5.69లక్షల మంది కూలీలు ఉన్నారు. పనిచేసే కూలీలు 1.99లక్షల మంది ఉన్నారు. 2025-26 సంవత్సరంలో చేపట్టబోయే పనులపై అధికారులు కార్యాచరణ రూపొందించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 32,33,056 పనిదినాలకు కూలీలకు దాదాపు రూ.96,99,16,800 బడ్జెట్‌ను రూపకల్పన చేశారు. అయితే సామగ్రికి సంబంధించిన నిధులు అదనంగా ఉంటాయి. గ్రామాల్లో గుర్తించిన పనులను చేపట్టేందుకు అవసరమయ్యే నిధులపై అధికారులు గ్రామాలవారీగా ప్రణాళికలు రూపొందించారు. ఉపాధి హామీ పథకం కింద సీసీరోడ్లు, మెటల్‌రోడ్లు వేసేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చండూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు, మరుగుదొడ్లను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నల్లగొండ జిల్లా స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే పరిశీలకులు అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చండూరు మండలంలోని ఉడుతలపల్లి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ సర్వేలో భాగంగా గ్రామంలోని అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, పాఠశాలలను ఆయన పరిశీలించారు. గ్రామంలోని ప్రజలకు స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా నిర్మించిన మరుగుదొడ్లు వాటిని వాడే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్ మొయినుద్దీన్, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో మాధవరెడ్డి, గ్రామస్పెషల్ ఆఫీసర్ నర్సింహ, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖర్గే, చిత్రంలో సీఎం రేవంత్ రెడ్డి

క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య

- యువనేతలకు ఆదర్శం ఆయన జీవితం
- మాజీ సీఎం రోశయ్య 92వ జయంతి సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, పొన్నం
- చాగంటికి సత్కారంతో పాటు ప్రశంసా పత్రం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్/రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు కొనియాడారు. నేటి యువతరం రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రోశయ్య 92వ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్టుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ప్రవచన కర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చాగంటి మాట్లాడుతూ.. రోశయ్య గవర్నర్‌గా ఉన్న సమయంలో చెన్నైలో ప్రవచనాలు చెప్పేందుకు వెళ్లినప్పుడు రాజ్‌భవన్ నుంచి బయటొకొచ్చి మరీ ఆయన స్వాగతం పలికారని గుర్తు చేసుకున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎప్పుడూ అందరికీ ఆదర్శ నాయకత్వాన్ని అందించే లక్ష్యంతో పనిచేశారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఆదర్శ రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల అప్పులు చేయకుండా ఉన్న దాంట్లో నిధులు సర్దుబాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన గొప్ప నేత రోశయ్య అని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి నిర్వహించడం అభినందనీయమని.. ఆయన వాగ్ధాటి, ఛలోక్తులను ఎవరూ మర్చిపోరని చెప్పారు. రోశయ్య ఆలోచనలు, ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలను పార్టీలకతీతంగా ఇప్పుడు అనుసరించాల్సిన అవసరముందని గుత్తా అన్నారు. ఇటు డీజీపీ కార్యాలయంలోనూ రోశయ్య జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి అదనపు డీజీపీ మహేశ్ భగవత్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే

మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది. లక్డీకాపూల్‌లోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 450 కిలోల బరువుతో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, దయానంద్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కేవీపీ రామచంద్రరావు, టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.

గ్రూపులు కడతామంటే.. భయపడం!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీల ఉమ్మడి, విస్తృత కార్యవర్గ సమావేశాల్లో ఖర్గే దిశానిర్దేశం చేశారు. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి పాల్గొన్నారు.

తెలంగాణ.. కాంగ్రెస్‌కు మోడల్ స్టేట్!

తెలంగాణను కాంగ్రెస్ మోడల్ స్టేట్‌గా దేశానికి చూపనున్నట్లు ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ సైద్ధాంతాలకు అనుగుణంగానే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా హామీలను సమర్థంగా అమలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. నేతలు పార్టీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరాలన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ సమావేశంలో చెప్పారు. ఇక రేవంత్ మంత్రివర్గంలో పనిచేయాలన్నది తన కోరికని, జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చెప్పారు.

మంత్రులపై సీఎం రేవంత్ అసంతృప్తి!

మంత్రులు, ఆయా జిల్లాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి పంపాలని మంత్రులు, పీసీసీ చీఫ్‌ను నాలుగు నెలలుగా కోరుతున్నా.. స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రతిపాదనలు పంపితే వెంటనే ఆమోదిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడగానే ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి ఉంటే.. నామినేటెడ్ పోస్టుల్లో ఒక టర్మ్ అవకాశాలు పూర్తయ్యేవని వివరించారు.

నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ:ఖర్గే

జూలై నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మంత్రులు, టీపీసీసీ చీఫ్‌కు ఖర్గే స్పష్టం చేశారు. దీన్ని సమన్వయం చేసుకునే బాధ్యత పీసీసీ చీఫ్‌దేనని.. పార్టీ కోసం కష్టపడిన వారికి, సమర్థులకే పదవులు ఇవ్వాలని సూచించారు. 'ప్రభుత్వంపై పార్టీ ఫిర్యాదు చేయడం చూశాం గానీ, పార్టీపై ప్రభుత్వం ఫిర్యాదు చేయడం ఇక్కడే చూస్తున్నా' అని ఖర్గే వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు ఖర్గే సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, కాపాడుకోవాలని చెప్పారు.



గాంధీభవన్ చేరుకున్న కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్

పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దు: సీఎం

నేతలు పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దని సీఎం రేవంత్ సూచించారు. పార్టీ పదవులతో గుర్తింపు, గౌరవం దక్కుతాయని, రాజకీయాల్లో ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరుగుతాయని, ఎక్కువ మందికి అవకాశాలు వస్తాయని వివరించారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని కోరారు. అందరూ కష్టపడి పనిచేసి.. కాంగ్రెస్‌ను రెండో సారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లూ కాంగ్రెస్‌దే అధికారమని ధీమావ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూసామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం చేద్దాం?


ఈ నెల 7న క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ

తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ జూలై 7న గాంధీభవన్‌లో భేటీ కానుంది. ఆధారాలు చూపకుండా అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందంటూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యే అయినందున.. అనిరుధ్‌రెడ్డికి క్రమశిక్షణా చర్యల కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేస్తుందా లేక చర్యల కోసం ఏఐసీసీ క్రమశిక్షణా కమిటీకి సిఫార్సు చేస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉంటే గాంధీభవన్‌లో చైర్మన్ మల్లురవి అధ్యక్షతన క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేతల వివాదంపై పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభిప్రాయం సేకరించింది. అనంతరం మీడియాతో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై కమిటీ పెద్దలు తనతో మాట్లాడారన్నారు. చిన్న చిన్న బేధాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, త్వరలో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని చెప్పారు.

డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చారిత్రాత్మక మైలురాయి

- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్/సైదాబాద్/యాదగిరిగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు పాల్పడి జైలుకు వచ్చిన వారిలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంతో రాష్ట్ర జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. చంచల్‌గూడ జైలులో నివృత్తి డీ అడిక్షన్ సెంటర్‌ను శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్య చికిత్స, కౌన్సిలింగ్‌ల ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ ఖైదీలు మత్తు వ్యసనాన్ని అధిగమించి వారి జీవితాలను పునర్నించడానికి సహాయపడే వాతావరణం చంచల్‌గూడ జైలులో ఉందని ప్రశంసించారు. కాగా, అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు.



జస్టిస్ సూర్యకాంత్‌కు నృసింహుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్నిన్యాయమూర్తికి అందజేశారు. కాగా, బాలల హక్కుల రక్షణ అంశంపై 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్' అనే పేరుతో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి స్టేక్ హోల్డర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, హై కోర్ట్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొననున్నారు.

34 కోట్ల రన్యారావ్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యారావ్‌కు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. బెంగళూరు విక్టోరియా లే అవుట్‌లోని ఇల్లు, అర్కావతి లే అవుట్‌లో స్థలం, తుమకూరులో పారిశ్రామిక స్థలం, అనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని అటాచ్ చేశామని ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు. దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన బంగారాన్ని తెస్తూ.. ఈఏడాది మార్చి 3న కెంపేగౌడ విమానాశ్రయంలో రన్యారావ్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో రన్యారావ్, రాజు, సాహిల్‌జైన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురూ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

తెరుచుకున్న తుంగభద్ర గేట్లు!

గద్వాల/ధోమలపెంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కృష్ణా, తుంగభద్ర నదుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరుగుతోంది. శుక్రవారం కర్ణాటకలోని తుంగభద్ర గేట్లు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు 75,612 క్యూసెక్కుల ప్రవాహాలు చేరగా 58 గేట్లకు గాను 21 గేట్లను ఎత్తి 62,612 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 75.84 టీఎంసీలున్నాయి. దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,09,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 56,998 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 169.86 టీఎంసీలున్నాయి. తుంగభద్ర గేట్లు తెరవడంతో శ్రీశైలానికి వరద మరింత పెరిగే అవకాశముంది. ఇక ఆల్మట్టికి వరద స్థిరంగా కొనసాగుతోంది. 94,767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా 14గేట్ల ద్వారా 95,566, విద్యుదుత్పత్తి ద్వారా 29,494 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రిడ్జిలు, సొరంగాలున్న హైవేలపై టోల్ చార్జీలు సగానికి తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 4: జాతీయ రహదారులపై సొరంగాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు లేదా ఎలివేటెడ్ హైవేలు వంటి నిర్మాణాలున్న భాగాలకు టోల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం 50శాతం వరకు తగ్గించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ టోల్ చార్జీలను లెక్కించడానికి కొత్త పద్ధతి/ఫార్ములాను నోటిఫై చేస్తూ ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారిపై ఉండే ప్రతి కిలోమీటరు వంతెనలు లేదా సొరంగాలకు వాహనదారులు సాధారణ టోల్ కన్నా పది రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీన్ని సవరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సొరంగాలున్న ప్రాంతాల్లో టోల్ రేటును 50 శాతం వరకు తగ్గించినట్టు ఓ అధికారి పేర్కొన్నారు.

అసెంబ్లీ మీడియా సలహా మండలి సభ్యుడిగా అశోక్



యాదగిరిగుట్ట రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ మీడియా సలహా మండలి సభ్యుడిగా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన నుంచు అశోక్‌ను నియమిస్తున్నట్లు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్, నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-19 జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సయ్యద్ అమీనోద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల జిల్లా క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని, ఇతర వివరాలకు 9885717996 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అంతర్జాతీయ పోటీలకు లావణ్య



లావణ్యను అభినందిస్తున్న అనంతరెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నార్వే దేశంలో ఆగస్టు 23 నుంచి 28వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ హోంలెస్ ఫుట్‌బాల్ వరల్డ్ కప్ పోటీలకు నల్లగొండ ఎన్జీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న మద్దిరాల లావణ్య ఎంపికైంది. ఫిబ్రవరి 22 నుంచి 24వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ హోంలెస్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున ఆడి ఆ జట్టును గెలిపించి బంగారు పతకం సాధించింది. జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. నల్లగొండ ఫుట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో కోచ్ దాసు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన లావణ్యను కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్ శుక్రవారం అభినందించారు. ఈకార్యక్రమంలో కోచ్‌లు దాసు, సునీత, వెంకట్ పాల్గొన్నారు.

పెరిగిన 'సాగర్' నీటిమట్టం

నాగార్జునసాగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం రోజు రోజుకూ పెరుగుతోంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో జూన్ 30వ తేదీన విద్యుదుత్పత్తి ప్రారంభంకాగా, సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఐదు రోజుల్లో సాగర్ నీటిమట్టం ఆరు అడుగులు పెరిగింది. జూన్ 29వ తేదీన సాగర్ నీటిమట్టం 514.20 అడుగులు (138.9118 టీఎంసీలు) కాగా, శుక్రవారం సాయంత్రానికి 522.80 అడుగులుగా (154.4310 టీఎంసీలు) నమోదైంది. బుధవారం సాయంత్రం 517.60 అడుగులుగా ఉన్న సాగర్ నీటిమట్టం ఒక్క రోజులో 2.6 అడుగులు పెరిగింది. గురువారం శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 58,578 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, శుక్రవారం 66,638 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద రాక ఇలాగే కొనసాగితే మరో 20రోజుల్లో సాగర్ నీటి మట్టం గరిష్ఠ స్థాయికి (590 అడుగులు, 312.0450టీఎంసీలు) చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ శ్రీశైలం క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తే 10 రోజుల్లో సాగర్ నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

రాళ్లలో రాగాలు

- వింత శబ్దాలను పలుకుతున్న గుట్టరాళ్లు
- అయిటిపాముల సమీపంలోని నగారా గుట్ట ప్రత్యేకం

(ఆంధ్రజ్యోతి-కట్టంగూరు)



రాయిని రాయితో తాకితే నిప్పు వస్తుంది. ఇది అందరికీ తెలిసిన విషయం. కానీ నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల సమీపంలోని నగారా గుట్టల్లోని రాళ్లకు ఇది మినహాయింపు.. ఇక్కడి గుట్టలోని రాళ్లు రాగాలు పలుకుతున్నాయి. వింతైన శబ్దాలు వస్తుండటంతో స్థానికులు వెళ్లి ఆ శబ్దాలను ఆస్వాదిస్తుంటారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి((65)కు కూతవేటు దూరంలో ఈ గుట్ట ఉంటుంది . ఒక్కో రాయి ఒక్కో శబ్దాన్ని పలుకుతుండటం గమనార్హం.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

నగారాగుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి. సెలవుల్లో చుట్టుపక్కల యువకులు ఇక్కడికి వచ్చి ఎంజాయ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలి.

-ఇటికాల సురేందర్, అయిటిపాముల, స్థానికుడు

బాలికలు క్రీడల్లో రాణించాలి

నల్లగొండ స్పోర్ట్స్ జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే బాలికలు క్రీడల్లో రాణించాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ అన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల మైదానంలో జూనియర్ బాలికల జిల్లాస్థాయి ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలతో బాలికల శారీరకంగా ధృడంగా ఉండటంతో పాటు చదువులో కూడా రాణిస్తారన్నారు. అనంతరం ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 50 మంది బాలికలు పాల్గొని క్రీడాప్రతిభను ప్రదర్శించారు. గెలుపొందిన క్రీడాకారులను జిల్లాస్థాయి టీమ్‌కు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు మంచిర్యాలలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్, కోచ్ దాసు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు.. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీ దళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.12,15,624 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

సంప్రదాయబద్ధంగా లక్ష్మీ నృసింహుని కల్యాణం

మఠంపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో శుక్రవారం స్వామి వారి నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి, రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణం అనం తరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



'ఇందిరమ్మ ఇళ్ల'కు ఆటంకాలు

(5వ పేజీ తరువాయి)

రూ.30వేల వరకు చెల్లించి బ్లాక్‌లో ఇసుకను కొనాల్సి వస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు. కలెక్టర్లు, మైనింగ్ అధికారులు ఈ విషయమై క్షేత్రస్థాయి పరిశీలన జరిపి వాస్తవికత ఆధారంగా సమీక్షించి ఇసుకను కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నామమాత్రంగా కమిటీలు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు సిమెంట్, ఇనుము, ఇటుకలు అందించేందుకు వీలుగా వ్యాపారులను ఒప్పించడంతో పాటు, ధరలను పెంచకుండా నియంత్రించే నిమిత్తం ఏర్పాటు చేసిన మండల స్థాయి ప్రైస్‌మానిటరింగ్ కమిటీలు నామమాత్రంగా మారాయి. ఈ కమిటీలు ఏర్పాటయినప్పటికీ ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరకు సిమెంటు, ఇటుకలు, ఇనుమును అందించలేకపోతున్నారని, దీంతో వ్యాపారులు చెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సి వస్తుందని లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రధానంగా సిమెంట్ ఇటుకల్లో నాణ్యత ఉండడం లేదని, దీంతో మట్టి ఇటుకలు కొనుగోలు చేస్తున్నామని, దీంతో ఖర్చు పెరుగుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. సిమెంట్, ఇటుకల ధరలు పెరగకుండా తక్కువ ధరకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మంజూరులో ఉన్న వేగం, నిర్మాణంలో కరువు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఉన్నంత వేగం నిర్మాణంలో కరువయింది. నిర్మాణంలో క్షేత్రస్థాయిలో స్థలం కొరత, స్థలం ఉన్నవారికి నిధుల కొరత, సిమెంట్, ఇసుక తదితర సామగ్రి లభ్యతలో ఇబ్బందులతో నిర్మాణాల్లో జాప్యం జరుగుతోంది. మొత్తం 12 నియోజకవర్గాలకు సంబంధించి రెండు దశల్లో ఇప్పటివరకు 39,995 ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో ఇప్పటివరకు కేవలం 24 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. మొత్తం 8,887 ఇళ్లు గ్రౌండింగ్ చేయగా, 205 ఇళ్లు శ్లాబ్ వేశారు. మరో 613 ఇళ్లు గోడల నిర్మాణాలు పూర్తయి స్లాబ్ వేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఇసుక కొరత లేకుండా, సిమెంట్, ఇటుకలు సరసమైన ధరల్లో నాణ్యమైనవి అందేలా చర్యలు తీసుకుంటే ఈ ఇళ్ల నిర్మాణం వేగవంతంగా సాగుతుందని, లేదంటే నిర్మాణంలో జాప్యం.. పథకం అమలుకు భారంగా మారుతుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

జిల్లా	మంజూరైన ఇళ్లు	గ్రౌండింగ్	బేస్‌మెంట్ లెవల్	రూఫ్ లెవల్	ఆర్‌సీసీ పూర్తయినవి
నల్లగొండ	17042	6844	592	98	23
సూర్యాపేట	14000	1281	924	377	146
యాదాద్రి	8953	762	362	138	36
మొత్తం	39,995	8887	1878	613	205

CLASSIFIEDS

ప్లాట్ అమ్మబడును

★ నల్లగొండ నుంచి సాగర్‌రోడ్‌లో గల రేయిన్‌బో వెంచర్ ఫేస్ - 2లో ప్లాట్ అమ్మబడును. తూర్పు ఫేస్, కరెంటు, బోరు మొదలైన సౌకర్యాలు కలవు. సంప్రదించు: 98856 50635, 62817 14883

AJY_219124

HOUSE FOR SALE

★ నల్లగొండ Hyd Road లో 300 Yads ఇల్లు 110 లక్షల ఇల్లు 87 లక్షలకే అమ్మబడును. వివరాలకు సంప్రదించండి. Nalognda Properties సెల్ : 9247272429

AJY_218985

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/- Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413656 9985413365

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 8885995946

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

కనగల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎల్లమ్మ ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద పలు రకాల మొక్కలను ఆయన నాటి మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ చెట్లతో వచ్చే ధనంతో పాటు సకాలంలో వర్షాలు కురుస్తాయని, కాలుష్యాన్ని తగ్గించి ప్రాణవాయువును అందజేస్తాయన్నారు. కార్యక్రమంలో ఈవో నాగిరెడ్డి, సిబ్బంది, ధర్మకర్తలు పాల్గొన్నారు.

నల్లగొండ తహసీల్దార్‌గా కొత్తపల్లి పరశురాం



నల్లగొండరూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మండల తహసీల్దార్‌గా కొత్తపల్లి పరశురాం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హరిబాబు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కాగా, తిప్పర్తి తహసీల్దార్‌గా పనిచేస్తున్న పరశురాం ఇక్కడికి వచ్చారు. అంతేకాక ఆయనకు తిప్పర్తి మండల తహసీల్దార్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా గౌరవ సలహాదారుగా కాచం



నార్కట్‌పల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం జిల్లా గౌరవ సలహాదారునిగా మండలంలోని అమ్మనబోలుకు చెందిన కాచం సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఆర్యవైశ్య సంఘంఅభివృద్ధి ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. సంఘానికి సలహాలు సూచనలు చేస్తూ తన వంతు సేవలందిస్తానన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

మర్రిగూడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అర్థమైన రీతిలో విద్యా బోధన చేయాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సంఖ్య వారి సమస్యలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

రహదారులన్నీ ఆగమాగం

» అధ్వానంగా చండూరు మండలకేంద్రంలో రోడ్లు
» ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

చండూరు మునిసిపాలిటీలో ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షం పడినా పట్టణమంతా చిత్తడిగా మారుతోంది. రహదారులపై ఏర్పడిన గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల వెడల్పు అటుంచితే కనీసం గతుకుల రోడ్డుకు అతుకులైనా వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-చండూరు)



కంకర తేలిన రోడ్డు

నిత్యం వందలాది మంది ప్రజలు మర్రిగూడ, నాంపల్లి, చండూరు, గట్టుప్పల, మండలాలకు చెందిన ప్రజలు చండూరు మండలకేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఈ రోడ్డుపై ప్రయాణించాలి. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ లేకపోవడంతో వర్షపు వరద నీరు ప్రధాన రహదారిపైకి రావడంతో గుంతలుగా మారి రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కస్తాల ఎక్స్‌రోడ్డు, పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట, కస్తూర్బా గాంధీ పాఠశాల ఎదుట, మునుగోడు బైపాస్ వద్ద పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటిని గమనించకపోవడంతో వాహనదారులు రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు.

అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణం

పట్టణంలో రూ. 30కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా నిర్మించాల్సిన డ్రైనేజీ పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలివేశాడు దీంతో ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే డ్రైనేజీలో నిలిచిన మురుగు నీరు ప్రధాన రహదారులపైకి ఎక్కువ లోతు లో నీరు చేరడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఇతర మార్గాల ద్వారా రాకపోకలు సాగించారు.

రివ్యూ చేసినా ఫలితం శూన్యం

రోడ్డు విస్తరణ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని 2023 డిసెంబరు 25న, 2024 జూన్ 13న మునిసిపాలిటీ అభివృద్ధిపై పట్టణంలో ఆర్ అండ్‌బీ గెస్టుహౌస్ అన్ని శాఖల అధికారులతో అప్పటి ఎమ్మెల్యేలు సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా రోడ్డు విస్తరణ పనులపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. నాసిరకంగా పను లు చేపట్టారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారుడికి, అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఆశించిన స్థాయిలో పనిలో పురోగతి కనిపించడం లేదు.

ర్యాంపు తొలగింపులో వివక్ష

చండూరు మునిసిపాలిటీలో రోడ్డు విస్తరణ తీరు, విస్తరణ కోసం అడ్డుగా ఉన్న దుకాణాల మెట్లు ర్యాంపులు మునిసిపల్ అధికారులు తొలగిస్తున్నారు. కానీ కొందరికీ మాత్రం మినహాయింపు ఇచ్చినట్లు తొలగించకుండా వదిలేసి పనులు జరుపుతున్న తీరు పక్కపక్కనే ఉన్న వారిపట్ల వివక్ష వెల్లువెత్తుతుం ది. పైరవీ, ధన ప్రవాహం ఈ వివక్షకు కారణమా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

తప్పిన పెను ప్రమాదం



రోడ్డు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్ నిర్ల క్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పెను ప్రమాదం తప్పింది. జూన్ 27వ తేదీన పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నాటిన కొత్తగా విద్యుత్ స్తంభాలు నాటే సమయంలో సరైన పద్ధతులు పాటించకపోవడంతో, చిరు వ్యాపారం చేసుకునే తోపుడు బండిపై పడటంతో అది పూర్తిగా ధ్వంసమైంది.

డీపీఆర్ లేకుండా పనులు



రోడ్డు విస్తరణ పనులకు డీపీఆర్ లేకుండా చేస్తున్నారు. మొదట 100 ఫీట్లు చెప్పిన అధికారులు, ఒక దగ్గర 95ఫీట్లు, మరో దగ్గర 90ఫీట్లు, మరో చోట 85 ఫీట్లు అని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారపరంగా చండూరు పట్టణంలో జనసంచారం ఎక్కువగా ఉంటుంది. విస్తీర్ణం తగ్గిస్తే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. విస్తీర్ణం పనుల్లో సంబంధిత అధికారుల్లో స్పష్టత లేదు.

- నలపరాజు సతీష్‌కుమార్

నష్టపరిహారం చెల్లించాలి



రోడ్డు విస్తరణ పనుల్లో కోల్పోతున్న దుకాణ యజమానులకు నష్టపరిహారం చెల్లించాలి. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని పనులు నాణ్యతో పూర్తి చేయాలి.

- కొత్తపాటి సతీష్

నిబంధన ప్రకారమే విస్తరణ పనులు



చండూరు పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు నిబంధనల ప్రకారమే చేపడుతున్నాం. పనులు త్వరలో పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌కు సూచిస్తాం.

- మల్లేశం, మునిసిపల్ కమిషనర్

కమలాద్రి లక్ష్మీనరసింహునికి పంచామృతాభిషేకం

నార్కట్‌పల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాపల్లి కమలాద్రి కొండపై నెలవైన లక్ష్మీనరసింహస్వామికి శుక్రవారం పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో హాజరైనట్లు ఆలయ వంశపారంపర్య అర్చకుడు కారంపూడి నర్సింహాచార్యులు తెలిపారు. అదేవిధంగా గర్భవంతుడు ఉన్నందున అక్కడ చేసిన ప్రసాదం స్వీకరిస్తే సంతానం కలుగుతుందన్నారు. అనంతరం ముగ్గురికి గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల బడ్జెట్ పెంచాలి

మునుగోడురూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి సామగ్రి ధరలు పెరిగినందున ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు బడ్జెట్ పెంచాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు సుర్గి చలపతి డిమాండ్ చేశారు. మండలంలోని ఎలగలగూడెంలో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కట్కూరి లింగస్వామి, మంజుల, సైదులు, ఉదయ్, శేఖర్, యాదయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదులో బీఎల్‌వోలే కీలకం

నార్కట్‌పల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు ప్రక్రియలో బూత్ లెవెల్ ఆఫీసర్ (బీఎల్‌వో)ల పాత్ర కీలకమని నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో బీఎల్‌వోల విధులు, బాధ్యతలను బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, డీటీ రామకృష్ణ, మాస్టర్ ట్రైనర్ సుధాకర్‌రెడ్డి, ఆర్ఐ తరుణ్ పాల్గొన్నారు.

శాలిగౌరారం ఎస్‌బీఐ మేనేజర్‌గా వెంకటరవి

శాలిగౌరారం, జూలై 4(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్‌గా గంగుల వెంకటరవి బాధ్యతలు స్వీకరించారు. ఆయన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ఎస్‌బీఐ మేనేజర్‌గా పనిచేస్తూ శాలిగౌరారానికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన మేనేజర్ వై.శ్రీనివాస్‌రావు చిట్యాల మండలం ఉరుమడ్ల బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు.

ఇందిరమ్మ ఇళ్ల బడ్జెట్ పెంచాలి

మునుగోడు రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు బడ్జెట్ పెంచాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు సుర్గి చలపతి డిమాండ్ చేశారు. పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎలగలగూడెంలోని ఈదులకంటి మంజుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటి సామగ్రి ధరలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు లింగస్వామి, మంజుల, సైదులు, ఉదయ్, శేఖర్ పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇంటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇంటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మేటిచందాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి ప్రారంభించారు. లబ్ధిదారులు పనులు ప్రారంభించి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగిలి లక్ష్మి, ప్రసన్న రవి, శ్రీనివాస్, రవి, రాజు, జెన్సియా తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం మహాసభలను జయప్రదం చేయాలి

గట్టుప్పల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): చండూరులో ఈ నెల 20వ తేదీన నిర్వహించే తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి సుధాకర్, పెద్దగాని నరసింహ, వెంకటేష్‌గౌడ్, వెంకటేష్, రాజు, ఖమ్మం రాములు, బుచ్చిరెడ్డి, జంగయ్య, రాములు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లే వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న కాంగ్రెస్ గ్రామస్థాయి నాయకుల ఆత్మీయ సమ్మేళనానికి నకిరేకల్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లాయి. ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం జెండా ఊపి బస్సులను ప్రారంభించి మాట్లాడారు. నకిరేకల్ నుంచి గ్రామశాఖ అధ్యక్షులు అత్యధిక సంఖ్యలో హైదరాబాద్ సమావేశానికి తరలివెళ్లారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

నల్లగొండరూరల్, మునుగోడు, చిట్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని డీవైఎఫ్ఐ నల్లగొండ మండల కార్యదర్శి కండె యాదగిరి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్వహించ తలపెట్టిన చలో సెక్రటరియేట్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లనీయకుండా డీవైఎఫ్ఐ నేతలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌లో నిర్బంధించారు. నల్లగొండలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి కండె యాదగిరి, నాయకులు రవీందర్, భూతరాజు మహేష్, తదితరులను అరెస్ట్ చేసి నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మునుగోడులో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు కట్ట లింగస్వామి, మిర్యాల భరత్‌కుమార్, మండల కార్యదర్శి యానరాజి వంశీకృష్ణ, యాట శ్రీకాంత్, పగిళ్ల యాదయ్య చిట్యాలలో జిల్లా సహాయ కార్యదర్శి వడ్డగాని మహేష్, జిట్ట రమేష్, పంది నరేష్, కిరణ్‌ను అరెస్ట్ చేశారు.

ఆధునిక తపాలా పరిజ్ఞానంతో వేగంగా సేవలు

నల్లగొండ, జూలై 4(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు వేగవంతమైన సేవలందించేందుకు ఆధునిక పోస్టల్ టెక్నాలజీని ప్రవేశపెట్టనున్నట్లు నల్లగొండ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.రఘునాథస్వామి తెలిపారు. నల్లగొండ పోస్టల్ డివిజన్‌లో ఈ నెల 8 నుంచి ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఐటీ 2.0 అప్లికేషన్ పేరుతో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న డివిజన్‌లోని పోస్టాఫీస్‌లలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించమని తెలిపారు.

తైక్వాండోలో విజేతకు ఎంఈవో సన్మానం

నార్కట్‌పల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ తైక్వాండో పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించిన ఏపీలింగోటం జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి చదువున్న ఆదిమళ్ల సత్యరాజ్‌ను ఎంఈవో నర్సింహ శుక్రవారం అభినందించారు. శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆదిమళ్ల మణిరాజు, బాజ మురళి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య

• సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి



కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, నకిరేకల్, మునుగోడు, కేతేపల్లి జూలై 4 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం సాగిన సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య తెలంగాణ అగ్నికణం అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పబ్బు వీరస్వామి, కేఎస్ రెడ్డి, జిల్లా యాదయ్య, డి.వెంకన్న జానయ్య శివ మహేష్ నాగరాజు సైదులు యాదగిరి జానీ, సోమయ్య వీరయ్య, రామస్వామి, ఎల్లయ్య పాల్గొన్నారు

● దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. నల్లగొండలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాలడుగు నాగార్జున, ప్రభావతి, గంజి మురళీధర్, పి.నర్సిరెడ్డి, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, సైదులు, కొండ అనురాధ, పద్మ, అశోక్‌రెడ్డి, పరిపూర్ణచారి పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బహుజన మహాసభ జిల్లా కన్వీనర్ చెట్టిపల్లి కాశీరాం, బహుజన కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల శ్రీనివాస్, డీసీపీ జిల్లా నాయకుడు బొల్లికొండ లింగయ్య, సైదులు పాల్గొన్నారు.

● మునుగోడులో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొమ్మరబోయిన లాలు, బండమీది యాదయ్య, కౌలానం, ఉప్పునూతల రమేష్, శంకర్, బెల్లం శివయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

● కేతేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ లూర్దుమారయ్య, నాయకులు కోట లింగయ్య, వంగూరి వెంకన్న, వెంకట్రాములమ్మ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థులపై వివక్ష తగదు



ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున

నల్లగొండరూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థులపై స్కూల్ యాజమాన్యం పుస్తకాలు ఇవ్వకుండా విద్యార్థులపై చూపుతున్న వివక్ష తగదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. బెస్ట్ అవైలబుల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో తండ్రులతో కలిసి పట్టణంలోని ఆల్ఫా పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లలో దళిత విద్యార్థులకు ఉన్నత విద్య చదివించాలనే లక్ష్యం బూడిదలో పోసిన పన్నీరులాగా మారుతోందని అన్నారు. దళిత విద్యార్థులను వేరేగా కూర్చోబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు వసతులు కల్పించకపోవడంతో నెల రోజులుగా తల్లిదండ్రులు ఎంతో ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. వెంటనే కలెక్టర్, సోషల్ వెల్ఫేర్ డీడీ కలుగజేసుకొని సమగ్రంగా విచారణ జరిపి ఆల్ఫా స్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి గాదె నరసింహ, మండల కార్యదర్శి బొల్లు రవీంద్ర కుమార్, తల్లిదండ్రులు బండారు శంకర్ కత్తుల శివ, టి.రవి తేజ రాజు, పేర్ల నరసింహ, కట్టా నవీన్, శ్రవణ్, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య సేవలు మరువలేనివి



మంత్రి క్యాంపు కార్యాలయంలో రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ, నార్కట్‌పల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా, రాజకీయవేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా రోశయ్య సేవలను కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నాయకులు వంగూరి లక్ష్మయ్య, జూకూరి రమేష్, మారగోని నవీన్‌గౌడ్, అల్లి సుభాష్ యాదవ్, కత్తుల కోటి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే పాల్గొన్న సభకు నల్లగొండ నుంచి పార్టీ శ్రేణులు తరలి వెళాయి. వాహన ర్యాలీని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అబ్బగోని రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

● దివంగత మాజీ సీఎం రోశయ్యకు నార్కట్‌పల్లి మండల ఆర్యవైశ్యులు ఘనంగా నివాళులర్పించారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వాసవీభవన్‌లో రోశయ్య జయంతిని నిర్వహించారు. ఆ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ శాఖల అధ్యక్షులు బిక్షకంటి శ్రీకాంత్, పసునూరి శ్రీనివాస్, యువజన విభాగం మండల, పట్టణ అధ్యక్షుడు ఇడుకుళ్ల సంపత్, పసునూరి సంపత్, దోసపాటి ప్రసాద్, కోటయ్య, వేణు, బండారు రమేశ్, శ్రీనివాస్, పల్లెర్ల ప్రవీణ్, గర్రె వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారీ ఐలయ్య

శాలిగౌరారం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య తెలిపారు. శుక్రవారం శాలిగౌరారం మండల కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పోరాటల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులను హరించే మోదీ ప్రభుత్వంపై అన్ని శ్రామిక వర్గాల ప్రజా పోరాట సంకేతమని, హిందుత్వ శక్తుల విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా సమిష్టి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్నవెంకులు, మండలాధ్యక్షులు సిరివంగి అంజనేయులు, కార్యదర్శి మక్కబుచ్చి రాములు, నాయకులు డెంకెల లింగయ్య, బల్లెం వెంకటయ్య, గుండ్ల మల్లేశం, యాదగిరి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరు: సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తవిటి వెంకటమ్మ కోరారు. కట్టంగూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు చెవుగోని ధనలక్ష్మి, భూపతి రేణుక, చెరుకు జానకి, మంగమ్మ, పుష్పాంజలి, రేణుక, సంధ్య, భారతి, శోభ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షుడిగా సిద్దార్థ



నూతనంగా ఎన్నికైన బాల్ బ్యాడ్మింటన్ జిల్లా కార్యవర్గం

నల్లగొండ స్పోర్ట్స్, జూలై 4(ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షుడిగా నలమోదు సిద్దార్థ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. 2025-2029 సంవత్సరం వరకు ఈ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడిగా నలమోదు సిద్దార్థ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిరుగుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆవిశెట్టి బయ్యన్న, కోశాధికారి బాలు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జంగయ్య, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, మల్లేశం, సత్తయ్య, స్వామి, జనార్థన్, అసద్, సంయుక్త కార్యదర్శులుగా ఖైరుద్దీన్, నర్సయ్య, జోసఫ్, అంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, డి.అంజయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జనార్థన్, పరిశీలకులుగా శ్యాం, ప్రకాష్‌నారాయణ, వ్యవహరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

చిట్యాల, జూలై 4(ఆంధ్రజ్యోతి):చిట్యాల మునిసిపాలిటీలోని పదవ వార్డుకు మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్ డిమాండ్ చేశారు. చిట్యాలలోని విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రం వద్ద శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో గతంలో ఉన్న 60 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడు పడి లోవోల్టేజీ సమస్యతో విద్యుత్ ఉపకరణాలు తరచూ పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసినట్లు తెలిపారు. వెంటనే ఎల్లమ్మగుడి దగ్గర మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కన్నెబోయిన మహాలింగం, గంజి గోవర్థన్, జయారపు రామకృష్ణ, కంచర్ల శంకర్‌రెడ్డి, సుంచు శ్రీను, పాలకూర వెంకటేశం, లతీఫ్, గాదె శ్రీహరి, అంజనేయులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలి



ప్లాస్టిక్ భూతం వేషంతో ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ సిబ్బంది

చిట్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనకు మునిసిపల్ ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ కోరారు. మునిసిపాలిటీ వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం ప్లాస్టిక్ నియంత్రించాలని కోరుతూ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ భూతం వేషధారణతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణం దెబ్బతింటుందని, భవిష్యత్తు తరాల మనుగడ కష్టమవుతుందని తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్‌ను ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సలీం

నల్లగొండరూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో బస్టాండ్ నుంచి మేకల అభినవ్ స్టేడియం వరకు, భాస్కర్ టాకీస్ నుంచి బీటీఎస్ వరకు నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనులను కాలయాపన చేయకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలో రోడ్డు విస్తరణ పనుల కోసం ఇళ్లు, దుకాణాలు, భవనాలు తొలగించి ఏడాదిన్నరవుతున్నా ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. మిర్యాలగూడ రోడ్డులో బీటీఎస్ దగ్గర కల్వర్టు నిర్మాణం కోసం రోడ్డు తవ్వి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కల్వర్టు నిర్మాణం నత్తనడకన సాగుతుందని అన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు గాదె నరసింహ, పాక లింగయ్య, సలివోజు సైదాచారి పాల్గొన్నారు.

ఫకీర్‌పురంలో ప్రారంభమైన ప్రభుత్వ పాఠశాల

నాంపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మల్లికార్జున్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఫకీర్‌పురం గ్రామంలో విద్యార్థులు లేక రెండేళ్లుగా మూతపడిన పాఠశాలను గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఉన్నత విద్యాధికారుల ఆదేశాలతో శుక్రవారం పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తుందని అన్నారు. విద్యార్థులకు విద్యా సామగ్రితో పాటు పాటు పాఠ్య పుస్తకాలను, స్కూల్ యూనిఫాంలను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముష్టిపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మునగాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు హిమామ్, రామదాసు, సీఆర్పీ ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	522.80 (154.4310)	66,638	15,110
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.50 (3.57)	208.56	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	155.772 (20.949)	నిల్	4,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

ఇసుక కొరత ఓవైపు.. పెరిగిన ధరలు మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసే మొత్తానికి, చేసే ఖర్చు రెట్టింపు కానుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్, స్టీలు, ఇటుకలను తక్కువ ధరకు ఇప్పించేలా చర్యలు తీసుకుంటే ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 నియోజకవర్గాలకు సంబంధించి రెండు దశల్లో ఇప్పటివరకు 39,995 ఇళ్లను మంజూ రు చేశారు. ఇందులో ఇప్పటివరకు కేవలం 24 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి.
- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)



నల్లగొండ మండలం తేలకంటి గూడెంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్లకు ఆటంకాలు

- ఇసుక కొరత, సిమెంటు ధరలతో ఇబ్బంది
- నామమాత్రంగా మారిన ప్రైస్ మానిటరింగ్ కమిటీలు
- ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలంటున్న లబ్ధిదారులు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇసుక, సిమెంటు, ఇటుకల ధరలు ఆకాశాన్నంటడంతో ప్రభుత్వ నిర్దేశిత వ్యయంలో ఇంటి నిర్మాణం పూర్తికావడం కష్టమేనన్న అనుమానాలున్నాయి. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక సేకరణ ప్రధాన సమస్యగా మారింది. మరోవైపు సిమెంట్, ఇనుము ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఇంటి నిర్మాణం లబ్ధిదారులకు భారంగా మారింది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు రూ.5లక్షలు చెల్లిస్తున్నప్పటికీ లబ్ధిదారులకు ఇంతకు రెట్టింపు స్థాయిలో ఖర్చు పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు. వీలైనంత వరకు ఇసుక, సిమెంట్ ధరలను అందుబాటులోకి తెస్తే ప్రభుత్వం ఆశించినరీతిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగి ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, ఆ దిశగా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇసుక కొరతపై ప్రస్తావన

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను కేటాయించినా లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో లేని పరిస్థితి కొనసాగుతోంది. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ఇసుక కొరతపై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రస్తావించడం ఇసుక కొరత తీవ్రతను తెలియజేస్తోంది. మునుగోడు నియోజకవర్గంలోని సంస్థాన్‌నారాయణపురం మండలంలో ఇసుక రీచ్‌లు లేనందున ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో లేదని, వారికి పొరుగున మండలాల్లో ఇసుకను కేటాయించాలని కోరారు. ఒక్క ఈ మండలమే కాకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 20 మండలాల వరకు ఇసుక కొరత ఉందని, ఈ మండలాల్లో స్థానికంగా ఉన్న చిన్న, చిన్న వాగులను ఇప్పటికే ఇసుక మాఫియా లూటీ చేయడంతో ఇసుక లేకుండా పోయిందని, క్షేత్రస్థాయి పరిస్థితిని గుర్తించి అధికారులు ఈ మండలాల లబ్ధిదారులకు వేరే ప్రాంతాల్లో ఇసుకను కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అదే విధంగా ఇసుక రీచ్‌లు ఉన్న చోట సైతం నాణ్యమైన ఇసుకను ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇవ్వడం లేదని, దీంతో లారీకి..

- మిగతా 7వ పేజీలో...



'ఉపాధి'కి యుక్తధార

అవకతవకలు లేకుండా ప్రత్యేకంగా యాప్ రూపకల్పన

- ఇకనుంచి యుక్తధార యాప్‌లోనే పనులు మంజూరు
- కూలీల వివరాలు, ఖర్చులు ఆన్‌లైన్‌లో నమోదు
- పైలట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామం

ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సాంకేతికతను జోడించి ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటోంది. ఈ పథకం కింద జరుగుతోన్న పనులన్నీ కూడా ప్రజలకు అందుబాటులో ఉండేలా తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఉపాధి కింద చేపట్టే పనుల్లో ఎలాంటి అవకతవలకు చోటులేకుండా ప్రత్యేకంగా యాప్ ను రూపొందించింది. ఇకనుంచి ఈ పథకం కింద శాటిలైట్ ఆధారంగా పనులను గుర్తించనున్నారు. దీని ఆధారంగా పనుల మంజూరుతోపాటు కూలీల వివరాలు, ఇందుకు అయిన ఖర్చు కు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిబంధనలు ఎప్పటికప్పటికీ మారుతున్నా, అవకతవకలు జరుగుతూనే ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. అక్రమాలను నివారించేందుకు పనుల వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేసేలా ప్రభుత్వం చర్యలు చేట్టింది. రాష్ట్రవ్యాప్తంగా బ్యాచ్‌లుగా విభజించి సాంకేతిక సిబ్బందికి వారం రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. 'భువన్' యాప్ వివిధ రకాల పనుల వివరాలు నమోదు చేస్తుండగా, అదే యాప్‌లో నూతనంగా 'యుక్తధార'లో పనుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో మొత్తం 17 మండలాలు 428 గ్రామపంచాయతీలు ఉండగా, వీటిలో ముందుగా మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. జిల్లాలోని 17 గ్రామాల్లో ఈ యాప్ కింద పనులు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

శాటిలైట్ ద్వారా పనుల నమోదు

ఉపాధి హామీ పథకంలో ఇప్పటివరకు కేవలం ప్రాంతం చూపి, పనులను ..

- మిగతా 6వ పేజీలో...



'యుక్తధార' యాప్‌పై శిక్షణ ఇస్తున్నాం..

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పథకాన్ని ఇప్పటికే భువన్ యాప్ ద్వారా పనులు, కూలీల వివరాలు నమోదు చేస్తున్నారు. అయితే శాటిలైట్ ఆధారంగా పనులు చేపట్టేలా ప్రభుత్వం యుక్తధారయాప్‌ను రూపొందించింది. ఇకనుంచి ఈ యాప్ ద్వారా పనుల గుర్తింపుతోపాటు వివరాలు నమోదు చేసేందుకు ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కూలీలకు ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.గ్రామాలవారీగా చేపట్టనున్న పనులపై గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పనులను గుర్తిస్తున్నాం.
- నాగిరెడ్డి, డీఆర్డీవో

సాగు చట్టాలపై అవగాహన ఉండాలి

రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్



రైతులకు సాగుచట్టాలపై అవగాహన కల్పిస్తున్న భూమి సునీల్

నార్కట్‌పల్లి, నకిరేకల్, కనగల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): సాగు చట్టాలపై ప్రతీ రైతు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ పార్మర్స్ సొసైటీ (లీఫ్స్) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాగు న్యాయయాత్ర శుక్రవారం జిల్లాలోని నార్కట్‌పల్లి, నకిరేకల్, కనగల్ మండలాల్లో నిర్వహించారు. ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. వ్యవసాయం చేస్తూ కేవలం పంటల సాగుపైనే అవగాహన ఉంటే సరిపోదని, భూమిని నమ్ముకుని జీవిస్తున్న రైతులకు సాగు న్యాయచట్టాలు కూడా తెలిసి ఉండాలన్నారు. రైతులకు చట్టాలను చుట్టాలుగా చేయడమే న్యాయయాత్ర ఉద్దేశమన్నారు. నాణ్యత లేని విత్తనాలు, ఎరువుల మోసాలు, మార్కెట్‌లో జరిగే అన్యాయం, పంటల బీమా వంటి అంశాల్లో రైతులకు మేలు చేసే న్యాయ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆయా సమావేశాల్లో భూదాన్‌భూముల సంస్థ మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఏడీఏ జమీరుద్దీన్, ఏవోలు గౌతమ్, డీటీ రామకృష్ణ, అమరేందర్‌గౌడ్, హరివెంకట ప్రసాద్, జీవన్, అభిలాష్, సందీప్, మల్లేశ్, రవి, ప్రవీణ్, నవీన్, అభిలాష్ ఆదర్శ రైతు సంఘం అధ్యక్షుడు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

- విద్యార్థులు కష్టపడి చదవాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



గురుకుల కళాశాలలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

డిండి, దేవరకొండ, కొండమల్లేపల్లి, కేతేపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు, కేజీబీవీలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లాలోని డిండి, దేవరకొండ, కొండమల్లేపల్లి, కేతేపల్లిలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, వసతులు, సదుపాయాల గురించి ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. అదనపు మంచాలు, బాత్రూంలు, తాగునీటి వసతి, అదనపు తరగతి గదులు, డార్మెటరీ తదితర విషయాల గురించి ఆరా తీశారు. ఆమె విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, వసతుల కల్పన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ, వంటగదిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఆయా పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పాఠశాల పక్కా భవనాలను ఆమె పరిశీలించారు. డిండి మండల కేంద్రంలో ని సాంఘిక సంక్షేమ(బాలికల) గురుకుల పాఠశాల సందర్శించిన సమయంలో ప్రధానంగా గురుకులంలో డ్రైనేజీ, నీటి సమస్య, కోతుల బెడద ఉన్నట్లు ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు విన్నవించారు. దేవరకొండ మండలంలోని సాంఘిక సంక్షేమ, గిరిజన, మైనార్టీ, బీసీ సంక్షేమ పాఠశాలలు, కళాశాలలను పరిశీలించారు. పెంచికల్‌పహాడ్ తెలంగాణ గిరిజన గురుకుల కళాశాలను కళాశాలలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్ కావాలని, రెసిడెన్షియల్ బ్లాక్ సరిపోవడంలేదని, కళాశాలలో 666 మంది విద్యార్థులు ఉండగా 50 మందికి మంచాలులేవని, మంచాలు, అదనపు తరగతి గదులు, డార్మెంటరీ కావాలని ప్రిన్సిపాల్ కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కేతేపల్లి మండలంలోని బొప్పారం గ్రామ శివారులో గల మూసీ గురుకుల బాలుర పాఠశాలను సాయంత్రం సందర్శించారు. అక్కడ వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులతో కలిసి కాసేపు సరదాగా వాలీబాల్ ఆడారు. అనంతరం ఆమె వారితో మాట్లాడి భోజన నాణ్యత, వసతుల కల్పన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోవడానికి కారణాలను తెలుసుకున్న ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్లు విద్యారాణి, బలరాంనాయక్, స్వప్న, విష్ణు, ఎంఈవో గోప్యానాయక్, కేతేపల్లి తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు ఉన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిగా రామకృష్ణారెడ్డి



రామకృష్ణారెడ్డి

బీబీనగర్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియామకం కాబోతున్న నలుగురు న్యాయమూర్తుల్లో ఒకరు వాకిట రామకృష్ణారెడ్డి ఉమ్మడి జిల్లా వాసి కావడం విశేషం. బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని చిత్రకానిగూడెం ఆయన స్వస్థలం. మాజీ సర్పంచ్, మాజీ జడ్పీటీసీ వాకిటి బాల్‌రెడ్డి రెండో కుమారుడు రామకృష్ణారెడ్డి 1970 సెప్టెంబరు 14న జన్మించారు. 1997లో న్యాయవాదిగా ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరఫున న్యాయవాదిగా కొనసాగిస్తున్నారు. హైదరాబాద్‌లోని నానక్‌సింగ్ మంచిరేవులలో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల

- ఖమ్మం జిల్లా ప్రజల తాగు నీటి అవసరాల కోసమే
- 4 రోజుల పాటు కొనసాగనున్న నీటి విడుదల



సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేస్తున్న జేఈ కృష్ణయ్య

నాగార్జునసాగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం పాలేరు జలాశయాన్ని నింపేందుకు సాగర్ నుంచి నీటి విడుదల ప్రారంభమైంది. శుక్రవారం పెద్దవూర మండలం పొట్టిచెల్మ వద్ద ఉన్న ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రాజెక్టు జేఈ కృష్ణయ్య నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోజుకు 3 వేల క్యూసెక్కుల చొప్పున నాలుగు రోజుల్లో ఒక టీఎంసీ నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నీటిని కేవలం పాలేరు జలాశయం నింపడానికేనని, ఆయకట్టులో రైతులు ఎవరు వాడుకోవద్దని సూచించారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 522.50 అడుగులు(153. 8745 టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 2,114 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కులు మొత్తంగా 3,014 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 54,542 క్యూసెక్కుల నీరు సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి కుడి, వరద కాలువకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎలాంటి నీటి విడుదల లేదు.

సాగర్‌ను సందర్శించిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం

నాగార్జునసాగర్‌ను శుక్రవారం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం, కేంద్ర పథకాల పర్యవేక్షణ నిర్వహణ బృంద సభ్యులు సందర్శించారు. సాగర్ ప్రధాన డ్యాంతో పాటు బుద్ధవనానికి చేరుకొని అక్కడ బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత చరిత వనం, జాతక వనం, బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వారికి వివరించారు. బృందంలో నావెల్ ప్రకాష్, అభిషేక్ విశ్వాస్, బీపీ యాదవ్, సలీం ఉన్నారు.

మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న కేంద్రం

- కార్మిక సంఘాల నాయకులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్ష, కార్మిక సంఘాల నాయకులు

నల్లగొండ రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి.నర్సింహ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తోందని ఆరోపించారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం చేస్తున్న ఆందోళన, పోరాటాలతో ఐదేళ్లుగా అమలు చేయలేదని ఇప్పుడు అమలు చేస్తూ పూర్తిగా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కేఎస్ రెడ్డి, డి.వెంకన్న, ఎండీ. సలీం, దండంపల్లి సత్తయ్య, అవుట రవీందర్ అద్దంకి నరసింహ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుదాకర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సమ్మె చేసే హక్కు లేకుండా కేంద్ర ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే ఆశాలకు ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనాన్ని అమలు చేసి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రొండి శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, దేవిరెడ్డి అశోక్ రెడ్డి, నాగయ్య, తంగెళ్ల నాగమణి, వెంకటాచారి, వెంకటయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సామగ్రిని సిద్ధం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, జూలై 4(ఆంధ్రజ్యోతి): రానున్న వానాకాలంలో సీజన్ ధాన్యం కొనుగోలుకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో వానాకాలం 2025 సీజన్ సంబంధించి వ్యవసాయ మార్కెట్ యార్డులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 10వ్యవసాయ మార్కెట్లు ఉండగా ఇటీవల జిల్లా యంత్రాంగం రెండు వ్యవసాయ మార్కెట్ యార్డులకు మొబైల్ గ్రేన్ డ్రైయర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మార్కెట్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేశం, జిల్లా మేనేజర్ హరీష్, డీఆర్‌వో శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోల పాత్ర కీలకం

తిరుమలగిరి(సాగర్): ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోల పాత్ర కీలకమైందని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేయాలని, గ్రామంలో నివసించని, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని అన్నారు.

అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పనుల పురోగతి గురించి ఎంఈవో శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో మౌలిక సదుపాయాల గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎలక్షన్ డీటీ మల్లికార్జున్, ఎలక్షన్ రీసోర్స్ పర్సన్లు మేదరి దేవేందర్, బి.బాలు, ఆర్‌పి లక్ష్మీకాంత్, సలీం, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

కంట్రిబ్యూటర్లు కావలెను

నల్లగొండ జిల్లాలో ఈ క్రింది సెంటర్ల నుంచి వార్తలు సేకరించేందుకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. అభ్యర్థులు స్థానిక స్థితిగతులపై స్పష్టమైన అవగాహన, నిష్పాక్షిక దృక్పథం, విషయాన్ని చక్కని తెలుగులో రాయగల సామర్థ్యం కలిగి ఉండాలి. ఆసక్తి ఉన్నవారు బయోడేటా, 2 పాస్‌ఫోటోలు తీసుకొని రాత పరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరు కావలసి ఉంటుంది.

కావలసిన సెంటర్లు
నల్లగొండ అర్బన్, నల్లగొండ సిటీ

రాతపరీక్ష తేదీ : 07.07.2025 సోమవారం
సమయం : ఉదయం 10 గంటలకు
స్థలం : నల్లగొండ ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయం

న్యూస్ నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి
సంప్రదించవలసిన చిరునామా
ఆంధ్రజ్యోతి యూనిట్‌కార్యాలయం :
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వేనెం. 1617, అద్దంకి బైపాస్‌రోడ్, AMRP కెనాల్ వద్ద, ఆర్జాలబావి గ్రామము, నల్లగొండ. 508001
Email: bm.nlg@andhrajyothy.com

పెండింగ్ మెస్ చార్జీలు విడుదల చేయాలి

తిరుమలగిరి(సాగర్), జూలై 4(ఆంధ్రజ్యోతి): గిరిజనహాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను విడుదల చేసేలా వర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యం లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ హాస్టల్‌లో మెనూ సక్రమంగా అమలు కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నల్లబెల్లి జగదీష్, కోరె రమేష్, సన్ని, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

వేములపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన ఉగ్గె మునీశ్వర్, శివ తమ తండ్రి ఉగ్గె లింగయ్య జ్ఞాపకార్థం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు బూరుగు రమేష్, వెంకన్న, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటలు ఆడేది ఎలా?

- అస్తవ్యస్తంగా ఎన్ఎస్పీ క్రీడా మైదానం నిర్వహణ
- అక్కడక్కడ నిలుస్తున్న వర్షపు నీరు
- స్టేడియం నిర్మాణం ఊసేలేదు

(ఆంధ్రజ్యోతి మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ పట్టణ నడిబొడ్డున ఉన్న ఎన్ఎస్పీ క్రీడామైదా నం నిర్వాహణ అస్త వ్యస్తంగా మారింది. ఏడున్నర ఎకరాల్లో ఉన్న ఈ మైదానాన్ని అభివృద్ధి చేసి, రాజీవ్‌గాంధీ స్టేడియంగా నామకరణం చేస్తామని నాటి పాలకులు ప్రకటించి మూడు దశాబ్దాలు దాటింది. స్టేడియం నిర్మాణానికి రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసింది. 2011లో క్రీడాభివృద్ధి శాఖ స్టేట్ డైరెక్టర్ మైదానంలో పర్యటించారు. నిధుల కొరతతో, మరే కారణమో తెలియదు కానీ అక్కడితోనే ఆ ఆలోచనకు తెరపడింది. ప్రత్యేక రాష్ట్రావిర్భావం అనంతరం క్రీడాప్రాంగణ ప్రవేశద్వారానికి ఇరువైపులా ప్రేక్షకు లు కూర్చునేందుకు గ్యాలరీలను మాత్రం నిర్మించి వదిలేశారు.

గత పాలకులు మైదానంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ట్రాక్ నిర్మాణం నేటికీ చేపట్టకపోవడంతో మైదానమంతా ఎత్తుపల్లాలుగా మా రింది. పడమర పక్కన ఒంపుగా ఉండటంతో వర్షపు నీరు నిలుస్తోందని క్రీడాకారులు వాపోతున్నారు. అక్కడక్కడ వరద నీరు నిలిచి గుంతలు ఏర్ప డటంతో ఆటలు ఆడలేని పరిస్థితి ఉందంటు



మిర్యాలగూడ పట్టణంలోని గుంతలమయంగా మారిన ఎన్ఎస్పీ క్రీడామైదానం

న్నారు. ఇక మైదానంలోని ఓ మూలన ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో వ్యాయామం చేసేందుకు పలు కాలనీల ప్రజ లు వినియోగించు కుంటున్నారు. స్టేజీ వద్ద 100 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు చేయడంతో గ్రౌండ్‌కు పర్యాటకులు సైతం వస్తుంటారు. ఇంత ఆదరణ కలిగిన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మైదానం మధ్య నుంచి రోడ్డు

విశాలవంతమైన మైదానం పట్టణ నడిబొడ్డున ఉండడంతో సభలు, సమావేశాలకు ప్రాంగణం వేదికగా మారిం ది. గతంలో మాజీ సీఎం కేసీఆర్ పట్టణ పర్యటన సందర్భంగా కాన్వాయ్ ప్రవేశించేందుకు కూల్చిన క్రీడామైదాన ప్రహరీ నేటికీ పునఃనిర్మించలేదు. దీంతో మైదానం మధ్య నుంచి రహదారిని ఏర్పాటు చేసుకున్నారు సమీప కాలనీల ప్రజలు. రెండు ప్రధాన ద్వారాలతో పాటు మరో రెండు అనాధికారిక ప్రవేశ మార్గాలు ఉండటంతో అన్ని రకాల వాహనాలు మైదానం మీదుగా వెళ్తున్నాయని, కొందరు క్రీడాప్రాంగణంలో కారు, ద్విచక్ర వాహనాల డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. దీంతో గ్రౌండ్‌లో సాధన చేసేందుకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని క్రీడాకారులంటున్నారు.


అభివృద్ధి చేయాలి



ఎన్ఎస్పీ క్రీడా మైదానం అభివృద్ధి చే యాలి. పట్టణం మధ్యలో ఉండటంతో వాకింగ్, వ్యాయామం చేసేందుకు చాలా మంది వస్తున్నారు. ప్రభుత్వం శ్రద్ధ సదుపాయాలు కల్పించాలి. అలాగే వాకింగ్ వచ్చే వారి కోసం మూత్రశాలలు నిర్మించాలి.

\- చేగొండి మురళీయాదవ్, స్థానికుడు

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి



ఎన్ఎస్పీ మైదానం ఎత్తుపల్లాలుగా ఉం డటంతో వాకింగ్ చేసేందుకు అనుకూలంగా లేదు. గుంతలు ఉండటంతో వాకింగ్‌కు వచ్చే వారికి ఇబ్బందిగా ఉంటోంది. అందుకే సమీపంలోని సుందరయ్య పా ర్కుకు వెళ్లాల్సి వస్తోంది. పార్కు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో మహిళలు, చిన్నారులకే అనుకూలంగా ఉంటుంది. ఎన్ఎస్పీ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం బాగుంది. వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండదు.

\- చెన్నబోయిన శ్రీనివాస్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● సుచరిత, పీహెచ్‌సీ వైద్యురాలు, వేములపల్లి



ఇంటర్వ్యూ Interview

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వేములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సుచరిత అన్నారు. దోమలు, ఈగల ద్వారా వచ్చే వ్యాధులు, మలేరియా, డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. (ఆంధ్రజ్యోతి -వేములపల్లి)

ఆంధ్రజ్యోతి : వర్షాకాలంలో ఎక్కువగా ఏ వ్యాధులు వస్తాయి?

వైద్యాధికారి : మలేరియా, డెంగీ వ్యాధులు అధికంగా ప్రబలుతాయి. చికున్‌గున్యా కూడా వచ్చే అవకాశం ఉంది. అలాంటి లక్షణాలు ఉంటే పీహెచ్‌సీని సందర్శించాలి.

ఆంధ్రజ్యోతి : వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వైద్యాధికారి : ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం చేరకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉన్న చోట దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. దోమకాటు నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారా?

వైద్యాధికారి : ప్రతి శుక్రవారం గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటిస్తూ వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నాం. గ్రామపంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పారిశుధ్యచర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌లో పూర్తిస్థాయి సిబ్బంది ఉన్నారా?

వైద్యాధికారి : పీహెచ్‌సీ పరిధిలో నాలుగు సబ్ సెంటర్లు ఉండగా వాటి పరిధిలో నలుగురు మొదటి ఏఎన్ఎంలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం సెకండ్ ఏఎన్ఎంలు గ్రామస్థాయిలో సేవలను అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు చేసేందుకు కృషి చేస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

చింతపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాల్లో 100 రోజులు టీబీ క్షయ వ్యాధులపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యాధుల బారిన పడకుండా వారికి ఎక్స్‌రే చేయించి మెరుగైన వైద్య సేవలు అం దించాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలన్నారు. దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీ దేవి, ఇక్బాల్, సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కల్యాణ చక్రవర్తి

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

దేవరకొండ, జూలై 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ గ్రామస్థాయి నాయకుల ఆత్మీయ సమ్మేళనానికి దేవరకొండ నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శుక్రవారం జెండా ఊపి బస్సులను ప్రారంభించి మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ గ్రామ, మండలశాఖ అధ్యక్షుడు నియోజకవర్గం నుంచి బస్సులలో తరలివెళుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

● మిర్యాలగూడ : గ్రామస్థాయి నాయకుల సమ్మేళనానికి తరలివెళ్తున్న వాహన శ్రేణికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎన్ఎస్పీ మైదానంలో గ్రామస్థాయి కార్యకర్తలను సమీకరించి సుమారు వంద కార్లలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, దేశిరెడ్డి శేఖర్‌రెడ్డి, రామకృష్ణ, గుండు నరేందర్, నాగునాయక్ పాల్గొన్నారు.

● చింతపల్లి, : మండల కేంద్రంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్ అధ్యర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి,ఎరుకల వెంకటయ్యగౌడ్, గుండ్లపల్లి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్): మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణానాయక్ జిల్లా నాయకులు శివాజీనాయక్, బీలునాయక్, బద్రినాయక్, రంగా, కొండలు, సైదులు, పాండు, రమేష్, రాజు, వీరాసింగ్, రాజాలు ఉన్నారు.



దేవరకొండలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



మిర్యాలగూడ: ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా మద్దతు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జూలై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా మద్దతు తెలుపుతున్నట్లు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు.స్థానిక రైతు సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె తలపెట్టారని అన్నారు. ఈ నెల 9న తలపెట్టిన సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డబ్బీకార్ మల్లేష్, వస్కుల మట్టయ్య, బంటు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రమేష్, పాల్గొన్నారు.

గ్రామాల్లో పీర్ల ఊరేగింపు

చింతపల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మొహర్రం పురస్కరించుకొని చింతపల్లి మండలకేంద్రంతో పాటు గొడకొండ్ల, కుర్మపల్లి, విరాజ్మాపూర్, తదితర గ్రామాల్లో గురువారం నిర్వాహకులు పీర్లను ఎత్తుకొని ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పీర్లను ఎత్తుకొని డప్పు వాయిద్యాల మధ్య గ్రామాల్లో ఊరేగిస్తూ సందడి చేశారు.



వి.టీనగర్‌లో పీర్లను ఊరేగిస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలి

మిర్యాలగూడ రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ అన్నారు. మండలంలోని గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మరుగుదొడ్లు, వంటశాలను పరిశీలించి మాట్లాడారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వంట గదులు పరిశుభ్రంగా ఉం డేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఎంఈవో లావూరి బాలు, ప్రిన్సిపాల్ ఉమాదేవి, కృష్ణానాయక్ ఉన్నారు.

● నాగార్జునసాగర్ : సాగర్ హిల్‌కాలనీలో బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలను సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలల రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పాఠశాల, కళాశాలల్లో ఎంతమంది విద్యార్థులు, ఎంత మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారో అని అడిగి తెలుసుకున్నారు ఆయన వెంట ఎంఈవో తరి రాములు, ప్రిన్సిపాళ్ల రవి కుమార్, మాధవిలత, ఆర్ఐ దండా శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



మిర్యాలగూడ గురుకుల సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్

మహిళా సాధికారతే లక్ష్యంగా పథకాలు



కమిషనర్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మహిళలు

మిర్యాలగూడ టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు రూపొందించాయని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం కార్యాలయంలో రిసోర్స్ పర్సన్లతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, సకాలంలో రీ పేమెంట్ చేయాలన్నారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. వార్డు వారీగా సమావేశాలు నిర్వహించాలని, ఆడిట్ ప్రక్రియ చేపట్టాలన్నారు. శ్రీనిధి రుణబకాయిలు రూ.2.5 కోట్లు రికవరీ చేసేందుకు సహకరించాలని ఆర్పీలను కోరారు. మెప్మా సిబ్బంది సమయ పాలన పాటించాలని, సమభావన గ్రూపులపై పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. కాగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు మహిళలు సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనిధి విభాగ అధికారులు శ్రీలేఖ, మల్లేశ్వరి, ఉమ, చంద్రకళ, సరిత, నాగమణి, పాజ, బక్కయ్య, వెంకటేశ్వర్లు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాగు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గుర్రంపోడు, జూలై 4: (ఆంధ్రజ్యోతి): రైతులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతు న్యాయ అవసరాలపై అధ్యయనం చేయటానికి లీఫ్స్ సంస్థ బృందం రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 28 నుంచి అక్టోబరు 2 వరకు 8 వేల మీదుగా 24 వందల కిమీ పర్యటించనున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ గున్నా రాజేందర్‌రెడ్డి, రైతు కమిషన్ ఏఓ. వెంకటప్రసాద్, లీఫ్స్ సంస్థ ప్రతినిధులు జీవన్, అభిలాష్, సందీప్, మల్లేష్, ప్రవీణ్ తాహశీల్దారు శ్రీనివాస్, ఏఓ మాధవరెడ్డి, ఏఈఓలు ఆదర్శ రైతు సంఘం అధ్యక్షుడు లింగయ్య తదితరులున్నారు.

ఉచితంగా బత్తాయి మొక్కల పంపిణీ

కొండమల్లేపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లిలోని ఉద్యాన పరిశోధన స్థానం కేంద్రం ద్వారా రైతులకు ఉచిత బత్తాయి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ సీనియర్ శాస్త్రవేత్త సీహెచ్.రాజాగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం షె డ్యూల్ కులాలు (ఎస్సీ) రైతులకు మాత్రమేనని పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లు ఉద్యాన పరిశోధన స్థానంలో సమర్పించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఎల్‌వోలకు శిక్షణ



బీఎల్‌వోలకు సూచనలు చేస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

కొండమల్లేపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌వోలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రమణారెడ్డి, తహసీల్దార్ నరేందర్ పలు సూచనలు చేశారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో 34 మంది బీఎల్‌వోలు పాల్గొనగా నలుగురు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, ఆర్.ఐ.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సంగీత, మాస్టర్ ట్రైనర్స్ శ్రీనివాస్, రమేష్, శేఖర్, గోవర్ధన్‌రావు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

దేవరకొండ ,పెద్దఅడిశర్లపల్లి, చింతపల్లి, డిండి జూలై4(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు ఇచ్చిన చలో సెక్రటరియేట్ పిలుపుమేరకు శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. దేవరకొండలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నెరవేర్చకుండా మోసం చేశారని అన్నారు. ముందు జ్యాబ్ క్యాలెండర్ తక్షణమే ప్రకటించాలని అన్నారు. దేవరకొండలో అరెస్టు అయినత వారిలో బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, పొట్ట మధు, జమీర్‌బాబా పెద్ద అడిశర్లపల్లిలో నాగరాజు, లోకేశ్, కళ్యాణ్,రామలింగం, సునీల్,ఉమేష్, చింతపల్లి మండల కేంద్రంల బీఆర్ఎస్ నాయకులు నల్ల శంకర్, వందనపు అంజనేయులు, ఉప్పల యాదయ్య, మైనార్టీ నాయకులు ఎండి.ఖాలేద్, సీమర్ల శ్రీను యాదవ్, ఆరేకంటి పృథ్వీరాజ్, డిండిలో బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్ష డు గుర్రం సురేష్, బూషిపాక సాయి ఉన్నారు.



చింతపల్లిలో అరెస్టు అయిన నాయకులు

దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధించాలి



మిర్యాలగూడలో కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ, మిర్యాలగూడటౌన్, దామరచర్ల, వే ములపల్లి జూలై 4(ఆంధ్రజ్యోతి): వీర తెలంగాణ సాయుధ పోరాట యోదుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి శుక్రవారం పలు మండలాల్లో నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివా ళులర్పించారు. మిర్యాలగూడ సీపీఎం కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, బీసీ భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ్‌నాయుడు, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, దామరచర్ల మండలం బొత్తలపాలెంలో సీపీఎం, బీసీ సంఘం నాయకులు. వేములపల్లిలో సీపీఎం నాయకులు కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని అన్నారు. మిర్యాలగూడలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కు ల మట్టయ్య, బంటు వెంకటేశ్వర్లు, వేములపల్లిలో సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, రెమడాల భిక్షం పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య సేవలు మరువలేనివి

మిర్యాలగూడ టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చేసిన సేవలు మరువలేనివని మునిసిపల్ మాజీ చైర్మన్, ఆర్యవైశ్యసంఘ పట్టణ అధ్యక్షుడు తిరునగరు భార్గవ్ అన్నారు. రోశయ్య పలు మండలాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మిర్యాలగూడ వాసవీభవన్‌లో, హాలియాలో వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా యువజన ఉపాధ్యక్షుడు కొండూరు శోభన్ బాబు ఆధ్వర్యంలో, పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ఉమ్మడి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మిర్యాలగూడలో భార్గవ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా సేవలందించిన రోశయ్య అడుగుజాడల్లో ఆర్యవైశ్యులు పయనించాలన్నారు. రాష్ట్ర రాజధానిలో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కర్నాటి రమేష్, గౌరు శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, గుండా నాగరాజు, చీదళ్ల శ్రీనివాస్, జయిని రాములు, పాందురంగయ్య, ప్రభాకర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. హాలియాలో కార్యక్రమంలో రీజన్ చైర్మన్ బ చ్చు సతీష్, గందె మహేష్, వాసవి క్లబ్ అధ్యక్షుడు గట్టు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాకునూరి నారాయణగౌడ్, ఎస్.కె. గౌసుబాబా, రమణయ్య, రేపాల వెంకన్న, పాల్గొన్నారు. పెద్దఅడిశర్లపల్లిలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు విడియాల రామయ్య ప్రధాన కార్యదర్శి సముద్రాల శేఖర్, కోశాధికారి మిరియాల సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు విడియాల భిక్షమయ్య జిల్లా సహాయక కార్యదర్శి గట్టు శ్రీనివాసలు, మంచాల బాబు, వీరమళ్ల సతీష్‌కుమార్,- మండల గౌరవ అధ్యక్షులు దొడ్డి లక్ష్మయ్య, వీరమళ్ల పరమేష, ఉప్పల కోటి, వెంకటేశ్వర్లు,విడియాల శ్రీనివాస్‌లు,వీరమళ్ల శ్రీను, మంచాల శ్రీనివాస్, శేఖర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పీఏపల్లి: రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు